# అభ్యుదయం

The Pride of Telugu national daily

RNI: TEL TEL /2019/12836





Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263

ఆంధ్రప్రదేశ్:- 9885426263



పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ గురువారం 01-10- 2026 సంపుటి : 6 సంచిక : 231 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00


## ఇంటర్నెట్ లేకుండానే మొబైల్‌లో లైవ్ టీవీ!



- ‘డైరెక్ట్-టు-మొబైల్’తో సరికొత్త టెక్నాలజీ
- సిమ్ కార్డు, డేటా కనెక్షన్ లేకపోయినా నేరుగా
- మొబైల్‌లోనే టీవీ ప్రసారాలు అమలుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు

మిగతా 2లో

## అక్టోబర్ 2 నుంచి ‘సేవ్ డెమోక్రసీ’ మార్చ్

2లో

- ఈసీపై ‘ఇండియా’ కూటమి సమరశంఖం..
- దేశవ్యాప్త ఆందోళనలకు కూటమి పిలుపు
- అక్టోబర్ 6న విపక్ష ఎంపీల ప్రదర్శన..
- కూటమి ఉద్యమ కార్యాచరణ ఖరారు




## గజ్వేల్ గడీ కూల్చినట్లే సిరిసిల్ల గడీని కూల్చేస్తాం

- సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం
- జెండా ఎగురవేసిన మొనగాడికి మంత్రి పదవి
- భవిష్యత్తులో మంత్రివర్గంలోకి తీసుకుంటా..
- గత ప్రభుత్వం సిరిసిల్లను ఉరిసిల్లగా మార్చారు
- సిరిసిల్ల ప్రజల గురించి ఏనాడైనా ఆలోచించిందా
- తెలంగాణ ఉద్యమం, ప్రజల ఓట్లతో రాజకీయ లబ్ది కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు కూడబెట్టుకున్నారు సిరిసిల్ల ప్రజాపాలన బహిరంగ సభలో సిఎం రేవంత్
- కేసీఆర్ కుటుంబంపై తీవ్ర స్థాయిలో విమర్శలు
- రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీకి ఎన్నిసార్లైనా వెళ్తా..
- కరీంనగర్ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



సిరిసిల్ల, **అభ్యుదయం**

గజ్వేల్ గడీ కూల్చినట్లే ఈసారి సిరిసిల్ల గడీని నేలమట్టం చేద్దామని కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కేసీఆర్ కుటుంబంపై సీఎం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గరుడ పక్షి దెబ్బ కాకి పిల్లకు ఏం తెలుసని ఎద్దేవా చేశారు. అమెరికా హోటళ్లలో ప్లేట్లు కడిగిన వ్యక్తికి తన విలువ ఎలా తెలుస్తుందని ఘాటుగా స్పందించారు. ఫామ్‌హౌస్‌లలో నిద్రపోయిన వారికి తన గురించి బాగా తెలుసని వ్యాఖ్యానించారు.

మిగతా 2లో

## పంటలకు కనీస మద్దతు ధర పెంపు



- 2,610కు చేరిన క్వింటా గోధుమలు
- రబీపై కేంద్ర కేబినెట్? కీలక నిర్ణయం కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర
- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి
- దిల్లీలో ట్రాఫిక్ పరిష్కారానికి చర్యలు
- ఏఐ సాయం తీసుకుంటామని వెల్లడి

న్యూఢిల్లీ, **అభ్యుదయం**

కేంద్ర ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా రబీ పంటలకు సంబంధించి 2027-28 సీజన్‌కు మద్దతు ధరను నిర్ణయించింది. గోధుమలు, బార్లీ (జౌ), శనగలు, ఆవాలు, పొద్దుతిరుగుడు (కుసుమ), మసూర్ (కందులు/చిరుధాన్యాల రకం) పంటల కనీస మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం పెంచింది. గోధుమలపై క్వింటాలుకు రూ.25 పెంచారు. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. కనీస మద్దతు ధరలో అత్యధికంగా కుసుమ పంటకు క్వింటాలుకు ?675

- మిగతా 2లో పేజిలో

## జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలి



- కాంగ్రెస్‌ను వీడిన వారంతా వెనక్కి రావాలి
- రేవంత్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యలు

హైదారాబాద్, **అభ్యుదయం**

వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా

మిగతా 2లో

## బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు

### మతం, దేవుండ్ల పేరుతో రాజకీయాలు

- బీజేపీ- కాంగ్రెస్ దుష్ట రాజకీయాలు
- బీజేపీతో మాకు ఎలాంటి పొత్తూ ఉండబోదు
- 26 ఏండ్లలో బీఆర్ఎస్ ఏనాడూ పొత్తు పెట్టుకోలే
- జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేపడితే..
- నియంత్రణ పాటించిన దక్షిణాదికి తీవ్ర నష్టం
- కేంద్ర ఎన్నికల సంఘం విశ్వసనీయత ప్రశ్నార్థకం
- సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని విచారించాలి
- సమస్యలపై యువత ప్రశ్నిస్తుంటే కేంద్రం డైవర్షన్



జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ మతం, దేవుండ్ల పేరుతో రాజకీయాలు చేయడం సిగ్గుచేటు. దేశాన్ని మత ప్రాతిపదికన విభజించేందుకు బీజేపీ ప్రయత్నిస్తుంటే, తెలంగాణ ముఖ్యమంత్రి మాత్రం రాముడు వర్సెస్ శివుడు అంటూ మన దేవుండ్ల మధ్యే విభజన తెచ్చేలా మాట్లాడుతున్నరు. ఇదేనా రెండు జాతీయ పార్టీల ఎజెండా? ఉద్యోగాల కల్పన, హామీల అమలు, అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై ఎందుకు చర్చించడం లేదు?

మిగతా 2లో



## డీఎస్పీ భీమ్‌రెడ్డి కేసులో కీలక మలుపు..

- అక్రమాస్తుల కేసులో సస్పెండ్ అయిన తెలంగాణ మాజీ డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డి
- 8 మందిపై బినామీ చట్టం కింద కేసులు
- దేశంలోనే ఇదే తొలిసారి కేసు నమోదు

2లో

## ఇంటర్నెట్ లేకుండానే మొబైల్‌లో లైవ్ టీవీ!

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30 మొబైల్ ఫోన్‌లో లైవ్ టీవీ ఛానల్స్ చూడటానికి ఇకపై ఇంటర్నెట్ డేటా లేదా వైఫై అవసరం లేదు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం 'డైరెక్ట్-టు-మొబైల్' అనే సరికొత్త టెక్నాలజీని వాణిజ్యపరంగా అందుబాటులోకి తెచ్చేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ టెక్నాలజీ ద్వారా సిమ్ కార్డు, డేటా కనెక్షన్ లేకపోయినా నేరుగా మొబైల్‌లోనే టీవీ ప్రసారాలను వీక్షించవచ్చు. బ్రాడ్‌కాస్టింగ్, బ్రాడ్‌బ్యాండ్ కలయికతో పనిచేసే సాంకేతికత. దీని ద్వారా ఎలాంటి ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండానే లైవ్ టీవీ, వీడియోలు, ఇతర మల్టీమీడియా కంటెంట్‌ను నేరుగా మొబైల్స్‌కు ప్రసారం చేయవచ్చు. ముఖ్యంగా ఇంటర్నెట్ సిగ్నల్స్ బలహీనంగా ఉండే గిరిజన, అటవీ, కొండ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లోని ప్రజలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రసార భారతి, ఐఐటీ కాన్పూర్, తేజస్ నెట్‌వర్క్స్ (గతంలో సాంఖ్య ల్యాబ్స్) సంయుక్తంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా 19కి పైగా నగరాల్లో ట్రయల్స్ విజయవంతంగా పూర్తయ్యాయి. వాణిజ్యపరమైన అమలు కోసం అక్టోబర్‌లో రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ జారీ చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 470-582 స్పెక్ట్రమ్ బ్యాండ్‌లో ఈ ప్రసారాలు జరుగుతాయని, దీనివల్ల సెల్యులార్ నెట్‌వర్క్‌లకు ఎలాంటి అంతరాయం ఉండదని పరిశోధకులు స్పష్టం చేశారు. అయితే, ఈ టెక్నాలజీ విస్తృత వినియోగానికి కొన్ని సవాళ్లు ఉన్నాయి. 'డైరెక్ట్-టు-మొబైల్' ప్రసారాలను స్వీకరించేందుకు ఫోన్లలో 3.0 ప్రమాణాలకు అనుగుణమైన హార్డ్‌వేర్ ఉండాలి. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న చాలా స్మార్ట్‌ఫోన్లు దీనికి సపోర్ట్ చేయవు. మరోవైపు, ఈ టెక్నాలజీ వల్ల తమ డేటా ఆదాయానికి గండి పడుతుందని టెలికాం కంపెనీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## డీఎస్పీ భీమ్‌రెడ్డి కేసులో కీలక మలుపు..

హైదారాబాద్, సెప్టెంబర్ 30 అక్రమాస్తుల కేసులో సస్పెండ్ అయిన తెలంగాణ మాజీ డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డి కేసులో సంచలన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే భారీగా ఆస్తులను గుర్తించిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ).. ఆ తర్వాత చేపట్టిన దర్యాప్తు ఆధారంగా ఇప్పుడు ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) కూడా రంగంలోకి దిగింది. దీంతో ఈ కేసులో దర్యాప్తు సంస్థలు ఏసీబీ, ఐటీ మరింత దూకుడు పెంచాయి. భీమ్‌రెడ్డికి బినామీలుగా వ్యవహరించినట్లు అనుమానిస్తున్న 8 మందిపై బినామీ ఆస్తుల చట్టం కింద కేసులు నమోదు చేశాయి. ఇది దేశంలోనే తొలిసారిగా బినామీ లావాదేవీల చట్టం కింద ఇలాంటి కేసుల నమోదు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. డీజీపీ కార్యాలయంలోని పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న సమయంలో భీమ్‌రెడ్డిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. జూన్ 27వ తేదీన నమోదైన ఈ కేసులో భాగంగా తెలంగాణ, కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో అధికారులు సోదాలు నిర్వహించారు. భూములు, ఇళ్లు, ప్లాట్లు, బ్యాంకు డిపాజిట్లు వంటి ఆస్తులకు సంబంధించిన వివరాలను అధికారులు గుర్తించినట్లు సమాచారం. మొత్తం 16 ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం రూ.200 కోట్లకు పైగా విలువైన ఆస్తులు గుర్తించినట్లు ఏసీబీ వర్గాల ద్వారా వెల్లడైంది. ఈ దర్యాప్తులో కొన్ని ఆస్తులు ఇతర వ్యక్తుల పేర్లపై ఉన్నప్పటికీ వాటి వెనుక భీమ్‌రెడ్డి పెట్టుబడులు ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది. దీంతో బినామీ ఆస్తుల కోణంలోనూ దర్యాప్తును అధికారులు చేపట్టారు. బినామీ ఆస్తులకు సంబంధించిన ఆధారాలను సేకరించేందుకు ఏసీబీ అధికారులు కోర్టు నుంచి సెర్చ్ వారెంట్లు పొందారు. చార్టర్డ్ అకౌంటెంట్ వెంకటేష్ సహా మొత్తం 8 మంది ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని పుప్పాలగూడతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన ఈ సోదాల్లో ఆస్తులకు సంబంధించిన పత్రాలు, నగదు, బంగారం, ఇతర కీలక ఆధారాలను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆస్తుల కొనుగోలుకు డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది.. ఆ ఆస్తులకు అసలు యజమాని ఎవరు అనే అంశాలను దర్యాప్తు సంస్థలు పరిశీలిస్తున్నాయి. భీమ్‌రెడ్డికి బినామీలుగా అనుమానిస్తున్న 8 మందిపై బినామీ ప్రాపర్టీ ట్రాన్సాక్షన్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

## అక్టోబర్ 2 నుంచి 'సేవ్ డెమోక్రసీ' మార్చ్

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30 ఓటరు జాబితా సవరణలో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలకు ఇండియా కూటమి సిద్ధమైంది. ఈ మేరకు దిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసింది. యువత, ఎన్జీవోలను కలుపుకుని అక్టోబర్ 2 నుంచి 8 వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్రలు చేపట్టనున్నారు. అలాగే జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేయనున్నారు. అక్టోబర్ 6న విపక్ష ఎంపీలంతా ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ర్యాలీగా చేపట్టనున్నారు. అక్టోబర్ రెండో వారంలో ప్రతిపక్ష నేతలంతా రాష్ట్రపతిని కలిసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినతిపత్రం సమర్పించనున్నారు. దేశవ్యాప్తంగా 5 భారీ ర్యాలీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. వాటి తేదీలు, ప్రదేశాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. గతంలో నోట్ బందీ చేసిన ప్రధాని మోదీ, ఇప్పుడు 'ఓట్ బందీ' ద్వారా ప్రజల ఓటు హక్కును కాలరాస్తున్నారని ఆరోపించారు. ప్రధాని, హోంమంత్రి ఈ ఓట్ల దొంగతనం వెనుక ఉండి ఎన్నికల సంఘాన్ని పావుగా వాడుకుంటున్నారని ఖర్గే ఆరోపించారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ ఈవీఎంలకు స్వస్తి పలికి బ్యాలెట్ పేపర్లను వాడాలని డిమాండ్ చేశారు. అలాగే సర్ కు ముందున్న ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సంస్థలను బలహీనపరుస్తున్నారని, ఎన్నికల సంఘం ప్రభుత్వ ప్రభావానికి లోనవుతోందని ఖర్గే ఆరోపించారు. అక్రమ మార్గాల ద్వారా ఎన్నికల్లో గెలుస్తున్నారని, ప్రతిపక్ష పార్టీల ప్రజాస్వామ్య పనితీరుకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. అక్టోబర్ 2 నుంచి 8 వరకు ఇండియా బ్లాక్ కార్యకర్తలు జిల్లా కలెక్టర్? కార్యాలయాల వద్ద నిరసనలు చేపడతారు. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం వద్దకు పాదయాత్ర చేస్తారు. ప్రతిపక్ష నాయకులు భారత రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరనున్నారు. అక్టోబర్ రెండోవారంలో మేము వారికి ఒక వినతిపత్రాన్ని సమర్పించనున్నాం. ప్రభుత్వం సృష్టిస్తున్న రాజ్యాంగపరమైన అడ్డంకులను, మాకున్న ఇబ్బందులను రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్తాం. ప్రజలను ఇబ్బంది పెడుతూ వ్యవస?థలను నాశనం చేస్తూ వారి సొంత నిర్ణయాలతో నేడు ఈ దొంగల ప్రభుత్వాన్ని నడుపుతున్నారని రాష్ట్రపతికి తెలియజేయాలనుకుంటున్నాం. ఈ విషయంలో మేం ఎంతవరకు విజయం సాధిస్తామనేది తర్వాత చూస్తాం. అక్టోబర్-నవంబర్ నెలల్లో ఐదు ప్రధాన ర్యాలీలు నిర్వహిస్తాం. ం

# పంటలకు కనీస మద్దతు ధర పెంపు



చొప్పున పెంపుదల చేశారు. ఆ తర్వాత రేప్‌సీడ్, ఆవాలకు క్వింటాలుకు ?413 చొప్పున పెంచారు. మసూర్ పంటకు క్వింటాలుకు ?390, బార్లీకి (జౌ) క్వింటాలుకు ?136, శనగలకు క్వింటాలుకు ?83, గోధుమలకు క్వింటాలుకు 25 చొప్పున పెంచారు. ఢిల్లీ ట్రాఫిక్ నిర్వహణను మెరుగు చేయడం కోసం 'ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' తీసుకురావాలని కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 1,529 ట్రాఫిక్ సిగ్నల్స్ స్థిరమైన మ్యాన్యువల్ పద్ధతిలో ఉన్నాయి. అయితే 'ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వచ్చిన తర్వాత ఈ సిగ్నల్స్ ట్రాఫిక్ రద్దీకి తగ్గట్లుగా సిగ్నల్ సమయాన్ని అవే అడ్జస్ట్ చేసుకుంటాయి. దీనిని మూడు విడతలలో (ఫేజ్‌లలో) అమలు చేయనున్నామని తెలిపారు. వేర్వేరు కారిడార్లలో వేర్వేరు సమయాల్లో ఈ పద్ధతిని అమలు చేస్తారు. ఇందుకోసం కేంద్రం 1,790 కోట్ల రూపాయలు ఖర్చు చేయనుందని తెలిపారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్‌తో కలిపి రెన్యూవబుల్ ఎనర్జీ సరఫరా చేయడం కోసం 1.86 లక్షల కోట్ల అంచనాతో కూడిన 'గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్ ×××' పథకానికి కూడా మోదీ కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశంలో శాస్త్రీయ పరిశోధనలు, వినూత్న ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 'పీఎం ధార' పథకాన్ని తీసుకొచ్చింది. రూ. 1,86,405 కోట్లను ఈ పథకానికి కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇక, నూనె గింజల విషయానికొస్తే ఆవాల మద్దతు ధర క్వింటాలుకు రూ. 6,200 నుంచి రూ. 413 పెరిగి రూ. 6,613కి చేరిందని అశ్వినీ వైష్ణవ్? పేర్కొన్నారు. అలాగే కుసుమలధర గత ఏడాది ఉన్న క్వింటాలుకు రూ. 6,540 నుంచి రూ. 675 పెరిగి రూ. 7,215కి చేరిందన్నారు. 2027-28 మార్కెటింగ్ సంవత్సరంలో 324 లక్షల టన్నుల ధాన్యానికి సంబంధించి రైతులకు చెల్లించే మొత్తం విలువ రూ. 90,962 కోట్లుగా ఉంటుందని ఆయన అంచనా వేశారు. వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ సిఫార్సుల ఆధారంగా, ఉత్పత్తి వ్యయం, 'ఎల్ నినో' ప్రభావంపై ఆందోళనలు, అలాగే అంతర్జాతీయ, దేశీయ ధరల పోకడలను పరిగణనలోకి తీసుకుని ఆరు రకాల రబీ పంటలకు కనీస మద్దతు ధర ను వ్యవసాయ శాఖ ప్రతిపాదించింది. 2026-27 పంట సంవత్సరానికి (జులై-జూన్) గోధుమల ఉత్పత్తి లక్ష్యాన్ని వ్యవసాయ శాఖ 121 మిలియన్ టన్నులుగా నిర్దేశించింది. గోధుమ అనేది ప్రధాన రబీ (శీతాకాలపు) పంట. సాధారణంగా అక్టోబర్‌లో విత్తనాలు చల్లడం, ఏప్రిల్‌లో పంట కోత ప్రారంభమవుతాయి.

## జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలి

పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు.
ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని,ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

# బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మతం, దేవుండ్ల పేరుతో రాజకీయాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 30
జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మతం, దేవుండ్ల పేరుతో రాజకీయాలు చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశాన్ని మత ప్రాతిపదికన, హిందూ-ముస్లింలుగా విభజించేందుకు బీజేపీ ప్రయత్నిస్తుంటే, తెలంగాణ ముఖ్యమంత్రి మాత్రం రాముడు వర్సెస్ శివుడు అంటూ మన దేవుండ్ల మధ్యనే విభజన తెచ్చేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇదేనా రెండు జాతీయ పార్టీల ఎజెండా? అని ప్రశ్నించారు.
తెలంగాణలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తంచేశారు. బీజేపీతో బీఆర్ఎస్‌కు ఎలాంటి పొత్తు ఉండదని స్పష్టంచేశారు. గత 26 ఏండ్లలో బీజేపీతో ఒకసారి కూడా పొత్తు పెట్టుకోలేదని, 2014, 2018, 2023 ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేశామని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ భావజాలపరంగా, సైద్ధాంతికంగా బీజేపీకి వ్యతిరేకమని, అలాంటప్పుడు ఆ పార్టీతో ఎందుకు పొత్తు పెట్టుకుంటామని ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్నదని, ప్రజల్లో రీకాల్, రిగ్రెట్, రివోల్ట్ పరిస్థితి కనిపిస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్‌కు ఓటేసినందుకు ప్రజలు పునరాలోచిస్తున్నారని, ఈ అసంతృప్తి తిరుగుబాటు దిశగా మారుతున్నదని తెలిపారు. కేరళలోని కొచ్చి వేదికగా గ్రాండ్ హయత్‌లో జరిగిన 'ఇండియా టుడే' కాన్‌క్లేవ్ సౌత్ సదస్సులో కేటీఆర్ మాట్లాడారు. 'తెలంగాణ స్టేట్.. ఫార్మేషన్ టు ట్రాన్స్‌ఫార్మేషన్' అనే ప్రధాన ఇతివృత్తంపై సాగిన ముఖాముఖిలో తన అభిప్రాయాలను స్పష్టంచేశారు.
అభివృద్ధిలో రోల్‌మాడల్ తెలంగాణ
తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు నుంచి అనతికాలంలోనే సాధించిన విప్లవాత్మక మార్పులను కేటీఆర్ సవివరంగా ఆవిష్కరించారు. ఎన్నో



అనుమానాలు, అపోహల మధ్య ఆవిర్భవించిన తెలంగాణను కేసీఆర్ నాయకత్వంలో పదేండ్ల వ్యవధిలోనే దేశానికే దిక్సూచిగా నిలిపామని వివరించారు. సంక్షేమం, పారిశ్రామికాభివృద్ధి, ఐటీ ఎగుమతులు, వ్యవసాయ రంగాల్లో సాధించిన అపూర్వ పురోగతి ద్వారా కొత్తగా ఏర్పడిన ఒక చిన్న రాష్ట్రం ఎలా ఆర్థిక ఇంజిన్‌గా మారిందో ప్రపంచానికి నిరూపించామని స్పష్టం చేశారు.
2014లో తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీసీ) రూ.నాలుగు లక్షల కోట్లు మాత్రమే ఉండగా, 2023 నాటికి రూ.15 లక్షల కోట్లకు చేరిందని చెప్పారు.

# గజ్వేల్ గడీ కూల్చినట్లే సిరిసిల్ల గడీని కూల్చేస్తాం

సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. గత రెండున్నరేళ్ల పాలనలోనే సిరిసిల్ల అభివృద్ధికి రూ.1,500 కోట్లు కేటాయించామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేసిన నాయకుడిని మంత్రివర్గంలోకి తీసుకుంటానని ముఖ్యమంత్రి సంచలన ప్రకటన చేశారు. గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు ఏమీ చేయకుండా టీవీ ఛానళ్లు, పత్రికలు, ఫామ్‌హౌస్‌లు, స్టార్ హోటళ్లు మాత్రమే సంపాదించుకున్నారని రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కరీంనగర్ కలెక్టరేట్ భవనాన్ని ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. టెండర్లు వేసి కేవలం కమీషన్లు దండుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చారని మండిపడ్డారు. చివరకు ఆడబిడ్డలకు ఇచ్చే బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లు కొట్టి తిన్నారని తీవ్ర పదజాలంతో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలకు 'పుట్టింటి సారె' ద్వారా నాణ్యమైన చీరలను అందిస్తూ సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామని పేర్కొన్నారు. శాసనసభ స్పీకర్‌గా ఉన్న దళిత బిడ్డ గడ్డం ప్రసాద్‌ను 'అధ్యక్షా' అని పిలవాల్సి వస్తుందనే అహంకారంతోనే కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ ముందు దళితులు డప్పు కొడితే ఆ



స్థలాన్ని పసుపు నీళ్లతో కడిగించారని, ఇది తీవ్రమైన అవమానమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను బహిష్కరించే వరకు సమాజం వదలదని హెచ్చరించారు. ఎర్రవెల్లి భూ ఆక్రమణలతో పాటు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావ్ అక్రమ ఆస్తుల లెక్కలు తేలుస్తామని, డెక్కన్ స్టార్ హోటల్స్ తదితర ఆస్తుల వివరాలను అసెంబ్లీలో సమయం చాలక దాచామని, త్వరలోనే పార్ట్-2 పేరుతో ప్రజల ముందు పెడతామని సీఎం స్పష్టం చేశారు. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసే నాయకుడిని కేబినెట్ బెర్త్ కన్ఫార్మ్ అంటూ ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో సిరిసిల్లలో కాంగ్రెస్ జెండా ఎగరేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు సీఎం పిలుపునిచ్చారు. సిరిసిల్ల గడీల మీద గురిపెడదాం.. ఫిరంగులమై పేలుదాం అంటూ కార్యకర్తల్లో జోష్ నింపేలా వ్యాఖ్యలు చేశారు. గతంలో గజ్వేల్ గడీ విషయంలో తాము చెప్పినది చేసి చూపించామని.. ఇప్పుడు సిరిసిల్లపై దృష్టి పెట్టామని రేవంత్ రెడ్డి అన్నారు. సిరిసిల్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేసే నాయకుడికి మంత్రి పదవి ఇస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్‌లో కుటుంబ సభ్యులకు కీలక పదవులు దక్కాయని.. కాంగ్రెస్‌లో మాత్రం పార్టీ కోసం పనిచేసిన సాధారణ కార్యకర్తలు, నాయకులకు కూడా అవకాశాలు లభిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల సమస్యలకు నిలయంగా మారిందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ముఖ్యంగా చేనేత, నేత కార్మికుల సమస్యలను ప్రస్తావిస్తూ గత ప్రభుత్వం వారి ఇబ్బందులను పరిష్కరించలేకపోయిందని విమర్శించారు. నేత కార్మికుల ఆత్మహత్యలు, ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలసలు వంటి అంశాలపై ఆయన ప్రశ్నలు సంధించారు. కేసీఆర్ కుటుంబం సిరిసిల్ల ప్రజల గురించి ఏనాడైనా ఆలోచించిందా అని ప్రశ్నించిన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ ఉద్యమం, ప్రజల ఓట్లను రాజకీయంగా ఉపయోగించుకుని ఆస్తులు కూడబెట్టుకున్నారని ఆరోపించారు. వహించినప్పటికీ నియోజకవర్గంలోని నేత కార్మికుల సమస్యలు ఎందుకు పూర్తిగా పరిష్కారం కాలేదని ప్రశ్నించారు. కేటీఆర్ అమెరికా నుంచి వచ్చి సిరిసిల్ల ఎమ్మెల్యే టికెట్ పొందారని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# హరీశ్ రావుతో ప్రియదర్శి భేటీ..



నటుడు ప్రియదర్శి మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ‘ది ప్యారడైజ్’ సినిమాతో పాటు అందులో తాను పోషించిన శంకరన్న పాత్ర గురించి ప్రియదర్శి ఆయనతో చర్చించారు. అలాగే తన సినీ ప్రయాణం, ప్రస్తుతం చేస్తున్న సినిమాలు, భవిష్యత్ ప్రాజెక్టుల గురించి కూడా హరీశ్ రావుతో కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. ఆత్మగౌరవం, అస్తిత్వం కోసం జరిగే పోరాటాలు ఒక సమాజానికి ఎలా స్ఫూర్తిగా నిలుస్తాయో తెలంగాణ ఉద్యమం ద్వారా చూశామని హరీశ్ రావు ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఒక జాతి గుర్తింపు కోసం సాగిన పోరాటాన్ని ‘ది ప్యారడైజ్’ సినిమాలో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రభావవంతంగా చూపించారని ఆయన అన్నారు.ఆ పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాత్రలో ప్రియదర్శి కనిపించిన తీరును హరీశ్ రావు ప్రత్యేకంగా ప్రశంసించారు. కేసీఆర్ హావభావాలు, నడక, మాటతీరు వంటి అంశాలను తెరపై సహజంగా ఆవిష్కరించడం అంత సులభం కాదని, అయితే ప్రియదర్శి ఆ పాత్రలో పూర్తిగా ఒదిగిపోయారని అన్నారు. కేసీఆర్‌ను పోలిన హావభావాలను ప్రియదర్శి ఎంతో సహజంగా పలికించారని హరీశ్ రావు అభినందించారు. పాత్రలో ఆయన చూపించిన నటన ప్రేక్షకులకు బలమైన అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు. ‘ది ప్యారడైజ్’ చిత్రబృందానికి ఆయన శు భాకాంక్షలు తెలిపారు.తెలంగాణ యాస, పల్లె జీవితాన్ని ప్రతిబింబించే కథలకు ప్రియదర్శి ఒక ప్రత్యేక గుర్తింపుగా మారారని హరీశ్ రావు అన్నారు. గతంలో వచ్చిన ‘మల్లేశం’ సినిమాలో తెలంగాణ చేనేత కార్మికుల జీవితాలను, ‘బలగం’ చిత్రంలో తెలంగాణ పల్లె సంస్కృతి, కుటుంబ బంధాలను తన నటన ద్వారా ప్రపంచానికి పరిచయం చేశారని గుర్తుచేశారు. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా పరిశ్రమలోకి వచ్చి స్వయంకృషితో మంచి నటుడిగా ఎదిగిన ప్రియదర్శి ప్రయాణం తెలంగాణకు గర్వకారణమని హరీశ్ రావు పేర్కొన్నారు. మట్టి కథలకు, తెలంగాణ నేటివిటీకి దగ్గరగా ఉండే పాత్రలను ఎంచుకుంటూ ఆయన మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.తెలంగాణ సినిమా, సంస్కృతిని మరింత విస్తృతంగా ప్రేక్షకులకు చేరువ చేసేలా భవిష్యత్‌లో ప్రియదర్శి మరిన్ని మంచి ప్రాజెక్టులు చేయాలని హరీశ్ రావు కోరారు.

ఈ సందర్భంగా హరీశ్ రావుకు ప్రియదర్శి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల మధ్య ఉంటూ, ప్రజల సమస్యల కోసం పనిచేసే నాయకుడిగా హరీశ్ రావు సంపాదించుకున్న గుర్తింపు వెనుక ఎంతో కృషి ఉందని పేర్కొంటూ ఆయనపై తన అభిమానాన్ని వ్యక్తం చేశారు. ఈ భేటీ సందర్భంగా సినిమా, తెలంగాణ సంస్కృతి, భవిష్యత్ ప్రాజెక్టులపై ఇద్దరి మధ్య ఆత్మీయంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

# అక్టోబర్ 2 నుంచి ‘సేవ్ డెమోక్రసీ’ మార్చ్..

### సీఈసీపై ఇండియా కూటమి నిరసనలు..



ఓటర్ల జాబితా సవరణ అంశంపై ఎన్నికల సంఘంతో కొనసాగుతున్న వివాదం నేపథ్యంలో ఇండియా కూటమి కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 2 నుంచి 8 వరకు వారం రోజుల పాటు ‘సేవ్ డెమోక్రసీ’ మార్చ్ నిర్వహించనున్నట్లు కూటమి నేతలు ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియా కూటమి నేతల సమావేశం జరిగింది. అక్టోబర్ 2 నుంచి 8 వరకు దేశవ్యాప్తంగా జిల్లా స్థాయిలో ‘సేవ్ డెమోక్రసీ’ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. అక్టోబర్ 6న కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ప్రతిపక్ష పార్టీల ఎంపీలు పాదయాత్ర చేపట్టబోతున్నట్టు తెలిపారు. అలాగే రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి తమ నిరసన గురించి వివరిస్తామని చెప్పారు. ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్లను వినియోగించాలని కూటమి నేతలు డిమాండ్ చేశారు భారత ప్రజాస్వమ్యాన్ని బతికించేందుకు ఇండియా బ్లాక్ నాయకులు వ్యక్తిగతంగా కట్టుబడి ఉన్నారని రాహుల్ గాంధీ అన్నారు. భారత ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన వారికి శిక్ష పడేలా చూడాలని ఇండియా కూటమి నాయకులందరూ కోరుకుంటున్నట్టు తెలిపారు. ‘వారు ఎంత పెద్ద వారైనా, ఎంత ఉన్నతాధికారులైనా.. వారి కంటే భారత ప్రజాస్వామ్యం గొప్పది’ అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# సింగరేణిలో40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారు : బాల్క సుమన్



హైదరాబాద్ : సింగరేణి సంస్థను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణ అడ్డు కుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. సింగరేణిని అవినీతి మయం చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి బామ్మర్ది సృజన్ రెడ్డి కింగ్ పిన్‌గా అవినీతి జరుగుతోందన్నారు. జైపూర్ పవర్ ప్లాంట్ లో 334 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే జరుగుతోంది. సింగరేణిలో40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని మండిపడ్డారు. ఒక్కో కార్మికుడికి లాభాల్లో లక్షా 80 వేల కోట్లు తక్కువగా ఇస్తున్నారు.సింగరేణి డబ్బులను సీఎం రేవంత్ రెడ్డి ఫుట్ బాల్ సోకులకు ఖర్చు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి అవినీతిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కేటీఆర్ లెటర్ రాశారు. కార్మికులకు నికర లాభాల్లో 36 శాతం వాటా ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సింగరేణి సంస్థలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 51 శాతాన్ని ప్రైవేట్ వాళ్లకు అమ్ముకోవాలని చూస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్ మేరకు డిప్యూటీ సీఎం భట్టి, అధికారులు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. సింగరేణి అంటే సిరుల గని.

**సిరిసిల్లకు ఎన్ని నిధులిస్తారో చెప్పాలి**

సింగరేణి సంస్థను ఎవరికైనా అమ్మితే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అక్టోబర్ 5 వ తేదీన తెలంగాణ భవన్ లో సింగరేణి కోల్ బెల్ట్ ఏరియాలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గ ఇంఛార్జిలు, కార్మిక సంఘం నేతలతో కేటీఆర్ మీటింగ్ ఉంటుందన్నారు. సిరిసిల్లను కేటీఆర్ ఎంతో అభివృద్ధి చేశారు. రేవంత్ రెడ్డికి మైక్ దొరికితే తిట్టడం తప్ప వేరే పని లేదన్నారు. సిరిసిల్లకు రేవంత్ రెడ్డి ఎన్ని నిధులు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి సిరిసిల్లకు టూరిస్ట్ లాంటి వారు. నాయకులను ఓడగొట్టడం, గెలిపించడం ప్రజల చేతుల్లో ఉంటుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నేతన్నల ఆత్మహత్యలు జరుగుతున్నాయి. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు చుట్టూ రేవంత్ రెడ్డి రాజకీయం తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు 45 టీఎంసీలు ఇవ్వొద్దని సీడబ్ల్యూసీకి చంద్రబాబు లేఖలు రాస్తున్నారు. నాన్ బేసిన్ కుప్పంకు కృష్ణా నది నీళ్లను తరలించారు.గురువు కండ్లలో ఆనందం కోసం రేవంత్ రెడ్డి తెలంగాణను ఎండబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకో 20 ఏళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ మొలకెత్తదన్నారు.

# మహిళా సిబ్బంది తొలగింపు

### - వైదొలగనున్న ఈఫిల్ టవర్ చీఫ్



పారిస్: హిందూ మత గురువులు ఈఫిల్ టవర్ ను సందర్శించిన సమయంలో అక్కడ పనిచేస్తున్న మహిళా ఉద్యోగినులను విధుల నుంచి తప్పించిన విషయం తెలిసిందే. ఆ చర్యను ఖండిస్తూ సెప్టెంబర్ ఏడో తేదీన ఈఫిల్ టవర్‌ను మూసివేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఈఫిల్ టవర్ సెక్యూర్టీ కంపెనీ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈఫిల్ టవర్ నిర్వహణ కంపెనీకి చీఫ్‌గా చేస్తున్న పాట్రిక్ బ్రాంకో రువియో తన పదవి నుంచి వైదొలగనున్నట్లు తెలిసింది. ఈ ఏడాది చివరలో ఆయన తన పోస్టును వీడనున్నారు.సెప్టెంబర్ 5వ తేదీన జరిగిన ఘటనలో నిర్వహణ లోపాలు ఉన్నట్లు దర్యాప్తు ద్వారా తేల్చారు. ఆ వైఫల్యాల వల్ల మహిళా సిబ్బంది ధర్నాకు దిగినట్లు కంపెనీ తన ప్రకటనలో చెప్పింది. ఈఫిల్ టవర్ చీఫ్‌గా 2018లో పాట్రిక్ తన బాధ్యతలను స్వీకరించారు. ప్రతి ఏడాది ఈఫిల్ టవర్‌ను సుమారు 70 లక్షల మంది పర్యాటకులు సందర్శిస్తుంటారు. తాజా ఘటన నేపథ్యంలో ఓ కార్మిక నేత స్పందిస్తూ మేనేజ్మెంట్ ఆంక్షలు ఆమోదయోగ్యంగా లేవని తెలిపారు.బోచసన్వాసి శ్రీ అక్షర్ పురుషోత్తమ్ స్వామినారాయణ్ సంస్థ గ్రూపు సభ్యులు ఈఫిల్ టవర్‌ను సందర్శించారు. ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బందిని తప్పించారు. ఆ ఘటనపై వివాదం మొదలైంది.

# రేవంత్ రెడ్డి రిబ్బన్ కటింగ్ సీఎం

### .. పాడి కౌశిక్ రెడ్డి ఫైర్..!



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిబ్బన్ కటింగ్ సీఎం అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్మించిన నిర్మాణాలకు రేవంత్ రెడ్డి రిబ్బన్‌లు కట్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఆయన కట్టిన నిర్మాణాలనే ప్రారంభిస్తున్నారని విమర్శించారు.కరీంనగర్ కలెక్టరేట్ కేసీఆర్ ఆనవాళ్లు కాదా..? అని పాడి కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. సిరిసిల్లలో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన సభకు ప్రజల నుంచి స్పందనే లేదని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఆయన ఓ సవాల్ విసిరారు. సిరిసిల్లలో ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన అభివృద్ధిలో కనీసం 10 శాతం అయినా తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో చేసి చూపించాలని అన్నారు. ముఖ్యమంత్రి సొంత గ్రామంలోనే కరెంట్ సరఫరా సరిగా లేదని ఎద్దేవాచేశారు.తెలంగాణలో తెలంగాణ తల్లిని కాదని కాంగ్రెస్ తల్లిని నిలబెట్టారని విమర్శించారు. రెండేళ్లలో మళ్లీ కేసీఆర్ సీఎం అవుతారని అన్నారు. అప్పుడు కాంగ్రెస్ తల్లిని ప్యాక్ చేసి గాంధీ భవన్‌కు పంపుతామని కౌశిక్ రెడ్డి చెప్పారు.

# సహ పైలట్‌తో పోరాడి..

### 180 మంది ప్రాణాలు కాపాడిన భారతీయ పైలట్




దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఉగ్రవాద ప్రయత్నాన్ని అదే విమానానికి కెప్టెన్‌గా ఉన్న ఓ భారతీయుడు అడ్డుకున్నారు. సహ పైలట్ దాడి చేసినా.. ప్రాణాలకు తెగించి మరీ ఆయన 180 మంది ప్రయాణికులను కాపాడారు. ఓవైపు దాడిని ఎదుర్కొంటూనే.. మరోవైపు విమానం కూలిపోకుండా నియంత్రించారు. అనంతరం ఫ్లైదుబాయ్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు ఆఫ్-డ్యూటీ పైలట్లు విమానాన్ని సురక్షితంగా సౌదీ అరేబియాలో ల్యాండ్ చేశారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్‌కు చెందిన వార్త సంస్థలు వెల్లడించాయి. దాడిలో భారతీయ కెప్టెన్‌కు గాయాలయ్యాయి.కాగా ఒమన్‌కు చెందిన పైలట్ ఈ విమానాన్ని కూల్చడానికి ప్రయత్నించాడని సమాచారం. దీనికి అడ్డుగా ఉన్న భారతీయ పైలట్‌పై కత్తితో దాడి చేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యం లో భారతీయ పైలట్ అతడితో పోరాడి.. ప్రయాణికులను రక్షించారు. ప్రస్తుతం ఇద్దరు పైలట్లు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ద

# స్వర్ణాంధ్ర విజన్ - 2047 లక్ష్యంగా ఏపీ ముందుకెళ్తోంది

ప్రకాశం జిల్లా, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్ - 2047 లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందుకెళ్తుందని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు (ాంఆంష్ట్రు +శీజవతీఅశీతీ ఖుఎష్ట్రుఎజూఫ్ఆ ఝతీఆధ్రుఎబ) వ్యాఖ్యానించారు. 100 స్మార్ట్ సిటీల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. ఒంగోలు అభ్యున్నతిలో భాగస్వాములైన ప్రతి పౌరుడికి హృదయపూర్వక అభినందనలు, ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ప్రకాశం జిల్లాతో తనకు ఉన్న ఆత్మీయ అనుబంధం, ఈ వేడుకను మరింత ప్రత్యేకంగా నిలుపుతోందని చెప్పుకొచ్చారు.ప్రకాశం జిల్లాలోని ఒంగోలు మున్సిపాలిటీ శతాబ్దిన్నర ఉత్సవాలను ఈరోజు (బుధవారం) ఘనంగా నిర్వహించారు. ఒంగోలు మినీ స్టేడియంలో జరిగిన ఉత్సవాలకు వెంకయ్య నాయుడు, కంభంపాటి హరిబాబు, ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ కంభంపాటి హరిబాబు మాట్లాడారు. ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా, ప్రజల మధ్యకు రావడం, తనకు మళ్లీ స్వగ్రామానికి వచ్చినంత ఆనందాన్ని కలిగిస్తోందని వెల్లడించారు.

# గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం’..

### వీబీ జీ రామ్ జీ అమలుపై మంత్రి సీతక్క సమీక్ష

హైదరాబాద్, సెప్టెంబర్ 30: వీబీ జీ రామ్ జీపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి క్షేత్రస్థాయి పరిస్థితులపై సమీక్ష చేపట్టారు. గ్రామాల్లో పనుల గుర్తింపు, ఉపాధి కల్పన, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి క్షేత్రస్థాయి సమస్యలపై మంత్రి ఆరా తీశారు. అమలులో గ్రామ పంచాయతీల పాత్ర, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారుఅర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. పనుల ఎంపికలో గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ఉపాధి పనుల్లో పారదర్శకత, నాణ్యత, జవాబుదారీతనానికి పెద్దపీట అని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా మండల, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

గ్రామీణ ప్రజలకు ఉపాధి, గ్రామాలకు అభివృద్ధి, అమలును మరింత పటిష్ఠం చేయాలని మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో 12 వేల మందికిపైగా సర్పంచులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బాలామృతం తీసుకొని ఆరోగ్యాలు మెరుగుపరచుకోవాలి.

## ఐసిడిఎస్ సూపర్వైజర్ శారద.



గోవిందరావుపేట, సెప్టెంబర్30 విధిగా బాలామృతం తీసుకొని ఆరోగ్యాన్ని మెరుగుపరు చుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ శారద అన్నారు, తాడ్వాయి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పసర సెక్టార్ లోని ,పస్రా-5 అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం సెక్టార్ లెవెల్ నిర్వహించడం జరిగింది,ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శారద తల్లులను ఉద్దేశించి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకా హారం లభించే ఆహార పదార్థాలు తీసుకోవాలని, గర్భస్థ దశ నుండి 2సం పిల్లల వరకు(1000రోజుల ప్రాముఖ్యత), 3సం -6సం వరకు అంగన్వాడి కేంద్రానికి హాజరయ్యే ఉచిత పాఠశాలపిల్లలకి ఇస్తున్న పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు."తొలిముద్ద" తో పోషకాహార భరోసా లభిస్తుందని అంగన్వాడీ కేంద్రాల్లో 3-6సం పిల్లలకు ఒకరోజు ఉప్మా, ఒకరోజు కిచిడి పెట్టడం జరుగుతుందన్నారు, అల్పాహారంలో ఉన్న పౌష్టికాహారం పై అవగాహన కల్పించా రు,శరీరానికి హాని కల్గించేఆహార పదార్థాలు తినకూడదనిఇంట్లో తయారు చేస్తున్న అన్నం తీసుకోవాల ని పిల్లలకు స్నాక్స్ ,బిస్కెట్స్, చిప్స్ ,కూల్ డ్రింక్స్ లాంటివి ఇవ్వకూడదని, తల్లులు పిల్లల కోసం ప్రత్యేకంగా ఇంట్లో స్నాక్స్ తయారుచేసి ఇవ్వాలని అంగన్వాడికి మూడు సంవత్సరాల నుండి పిల్లలను పంపించాలని , పిల్లలకు మరియు గర్భిణీ బాలింతలకు, అంగన్వాడీ కేంద్రంలో ఇస్తున్న పౌష్టికాహారం, ఒక్కపూట భోజనం ,పాలు ,గుడ్లు, కురుకురే, బాలామృతం తీసుకుని ఆరోగ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. ఎస్ ఏ ఎం, మామ్ పిల్లలకు ఇచ్చే బాలామృతం తప్పకుండా తినిపించాలని కోరారు. అన్ని రకాల పౌష్టికాహారం లభించే ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు, గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ అంగన్వాడీ కేంద్రాన్ని
" మన అంగన్వాడీ- మన బాధ్యతగా'భావించాలని సరైన పౌష్టికాహారం తీసుకుని అందరూ మంచి ఆరోగ్యాన్ని కలిగి ఉండాలని తెలియజేశారు. తల్లులందరూ పాటిస్తున్న పౌష్టికాహార బెస్ట్ ప్రాక్టీసెస్ లను పంచుకోనైనదిఈ కార్యక్రమంలో ఐసిపిఎస్ జ్యోతి,ప్రథమ్ కో ఆర్డినేటర్ అనిల్ కుమార్, సెక్టార్ టీచర్స్,ఆశా వర్కర్,ఆయా, తల్లులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదును విజయవంతం చేయాలి

## అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలి: దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ సెప్టెంబర్ 30
వరంగల్--నల్గొండ--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. హనుమకొండలోని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని ఓటరు నమోదు కార్యక్రమంపై విస్తృతంగా చర్చించారు.
ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హత కలిగిన పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని నాయకులకు సూచించారు. ప్రతి డివిజన్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారికి ఓటరు నమోదు ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని నిర్ణయించారు.
దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని అన్నారు. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించే విధంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించి పట్టభద్రులకు ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని నివృత్తి చేస్తూ, అవసరమైన సమాచారాన్ని అందించాలని సూచించారు.
పార్టీ నాయకులు సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని, ప్రతి అర్హుడిని ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. పట్టభద్రుల సమస్యలు, వారి హక్కులు, ప్రజాస్వామ్య ప్రక్రియలో వారి భాగస్వామ్యం వంటి



అంశాలపై కూడా విస్తృతంగా అవగాహన కల్పించాలని నాయకులు చర్చించారు.
ఈ సమావేశంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాద వరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ ప్రెసిడెంట్లు, మాజీ డివిజన్ ప్రెసిడెంట్లు,బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.మాజీ కార్పొరేటర్లు, డివిజన్ ప్రెసిడెంట్లు, మాజీ డివిజన్ ప్రెసిడెంట్లు,బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలో ర్యాగింగ్ కలకలం



## జూనియర్ విద్యార్థిపై సీనియర్ల దాడి చేశారని ఆరోపణ

## గాయపడిన విద్యార్థికి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స

## జాతీయ రహదారిపై జూనియర్ విద్యార్థుల ఆందోళన

## ముందే ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ప్రిన్సిపల్‌పై ఆరోపణ

సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 30: సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఇంజనీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ ఆరోపణలు కలకలం రేపాయి. ఈఈఈ రెండో సంవత్సరం చదువుతున్న రిత్విక్ అనే విద్యార్థిపై అదే కళాశాలకు చెందిన ఫైనల్ ఇయర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి దాడి చేశారని తోటి విద్యార్థులు ఆరోపించారు. దాడిలో గాయపడిన విద్యార్థిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.
విద్యార్థుల కథనం ప్రకారం.. రిత్విక్‌ను ఇద్దరు సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేస్తున్న విషయాన్ని ముందుగానే కళాశాల ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే దీనిపై తక్షణ చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. ప్రిన్సిపల్‌కు తమపై ఫిర్యాదు చేస్తావా అంటూ సీనియర్ విద్యార్థులు రిత్విక్‌పై విచక్షణారహితంగా దాడి చేశారని పేర్కొన్నారు.ఈ విషయం తోటి విద్యార్థులకు తెలియడంతో కళాశాలలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాధిత విద్యార్థికి మద్దతుగా పెద్ద సంఖ్యలో జూనియర్ విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన




చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై బైఠాయించారు.

సమాచారం అందుకున్న జోగిపేట సీఐ అనిల్ కుమార్ అక్కడికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడి ఘటన వివరాలను తెలుసుకున్నారు. ర్యాగింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు విద్యార్థులను క్యాంపస్ నుంచి సస్పెండ్ చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ తెలిపారని పోలీసులు విద్యార్థులకు వివరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ శాఖ తరఫున తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

అయితే ముందుగానే సమాచారం ఇచ్చినా కళాశాల యాజమాన్యం స్పందించకపోవడం వల్లే పరిస్థితి దాడి వరకు వెళ్లిందని ఆందోళన చేస్తున్న విద్యార్థులు ఆరోపించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రిన్సిపల్‌పైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల డిమాండ్లను జిల్లా అధికారులతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.
గతంలోనూ క్యాంపస్‌లో విద్యార్థి మృతి ఘటన చోటుచేసుకున్న నేపథ్యంలో తాజా ర్యాగింగ్ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థుల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

# మామ్నూర్ ఎయిర్‌పోర్ట్‌కు 'మహారాణి రుద్రమదేవి విమానాశ్రయం' పేరు సముచితం

## నేడు గోడపత్రిక ఆవిష్కరణ.. రేపు ఐఎంఏ హాల్‌లో చర్చా వేదిక



వరంగల్, సెప్టెంబర్ 30వరంగల్ మామ్నూర్ ఎయిర్‌పోర్ట్‌కు "మహారాణి రుద్రమదేవి విమానాశ్రయం" అని పేరు పెట్టడం సముచితమనే అంశంపై ప్రజ్ఞాభారతి-వరంగల్ ఆధ్వర్యంలో చర్చా వేదిక నిర్వహించనున్నట్లు సంస్థ వరంగల్ కన్వీనర్, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ రాంగోపాల్ రెడ్డి తెలిపారు.ఈ మేరకు సెప్టెంబర్ 30న సాయంత్రం 6 గంటలకు ఎంజీఎం ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఐఎంఏ హాల్‌లో చర్చా వేదిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను మంగళవారం పోచమ్మ మైదాన్‌లోని ప్రజ్ఞాభారతి వరంగల్ కార్యాలయంలో ఆవిష్కరించారు.
రేపటి చర్చా వేదికకు ప్రజ్ఞాభారతి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రముఖ విశ్లేషకులు, చార్టెడ్ అకౌంటెంట్ మామిడాల గిరిధర్ ప్రధాన వక్తగా హాజరుకానున్నారు. ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ వీరంరాజు సోమశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.
వరంగల్ చరిత్ర, కాకతీయుల వారసత్వం, మహారాణి రుద్రమదేవి చారిత్రక ప్రాధాన్యత వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని మామ్నూర్ విమానాశ్రయానికి రుద్రమదేవి పేరు పెట్టే ప్రతిపాదనపై చర్చించేందుకు ఈ వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ చర్చా వేదికలో నగర ప్రజలతో పాటు మేధావులు, పుర ప్రముఖులు, సాహితీవేత్తలు, విద్యార్థులు, చరిత్రకారులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకోవాలని ప్రజ్ఞాభారతి-వరంగల్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. వివిధ వర్గాల అభిప్రాయాలను ఒకే వేదికపై చర్చించేందుకు ఈ కార్యక్రమం అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు.గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రజ్ఞాభారతి ప్రాంత బాధ్యులు చామర్తి ప్రభాకర్ (అడ్వకేట్), జిల్లా కో-కన్వీనర్ బూర రమేష్, ప్రజ్ఞాభారతి సభ్యులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు





ములుగు సెప్టెంబర్ 30 ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా భూ రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, అధికారులు బాధ్యతాయుతంగా నిర్దేశిత పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు.
బుధవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, తో కలిసి జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లతో భూ రీ సర్వే, పై ఐ డి ఓ సి సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూ రీ సర్వే పనులలో వేగం పెంచాలన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను పర్యవేక్షిస్తూ, కొలతలు, భూ వివరాల నమోదులో పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భూభారతి, సాదా బైనామాలకు సంబంధించిన దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందిస్తూ, భూ సమస్యల పరిష్కారంలో అనవసర జాప్యం లేకుండా చూడాలన్నారు.
ఈ సమావేశంలో ఆర్డీవో కృష్ణవేణి , అన్ని మండలాల తహసిల్దార్ లు, డిప్యూటీ తహసిల్దార్ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కుల్దీప్ యాదవ్ 'డబుల్ సెంచరీ'

టీమిండియా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ అరుదైన రికార్డ్‌ను సొంతం చేసుకున్నాడు. వన్డే క్రికెట్‌లో 200 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. అత్యంత వేగంగా ఈ ఘనతను అందుకున్న తొలి భారత స్పిన్నర్‌గా నిలిచాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా వెస్టిండీస్‌తో బుధవారం జరిగిన రెండో మ్యాచ్‌లో షై హోప్, కీమో పాల్‌ను ఔట్ చేయడం ద్వారా ఈ ఘనతను అందుకున్నాడు. 123 వన్డేల్లో 26.70 సగటుతో కుల్దీప్ యాదవ్ 200 వికెట్లు పడగొట్టాడు. ఇందులో రెండు సార్లు ఐదు వికెట్ల ఘనత ఉండగా.. 10 సార్లు నాలుగు వికెట్ల ప్రదర్శన చేశాడు. కుల్దీప్ యాదవ్ అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు 6/25గా ఉన్నాయి. మహమ్మద్ షమీ 104 వన్డేల్లో 200 వికెట్ల మైలురాయి అందుకొని అత్యంత వేగంగా ఈ ఘనత సాధించి తొలి భారత బౌలర్‌గా కొనసాగుతున్నాడు. కుల్దీప్ యాదవ్ రెండో స్థానంలో ఉండగా.. అజిత్ అగార్కర్ 133 వన్డేల్లో, జహీర్ ఖాన్ 144 వన్డేల్లో 200 వికెట్ల మార్క్‌ను చేరుకున్నారు. భారత క్రికెట్‌లో ఇప్పటి వరకు 9 మంది బౌలర్లు 200 వికెట్ల మైలురాయి అందుకోగా.. అనిల్ కుంబ్లే 334 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. జవగళ్ శ్రీనాథ్ (315 వికెట్లు), అజిత్ అగార్కర్(288 వికెట్లు), జహీర్ ఖాన్(269 వికెట్లు, హర్భజన్ సింగ్(265 వికెట్లు), కపిల్ దేవ్(253 వికెట్లు), జడేజా(232 వికెట్లు), షమీ(206 వికెట్లు) కుల్దీప్ యాదవ్ కంటే ముందున్నారు.

# క్రికెట్‌కు ఐర్లాండ్ ఆల్‌రౌండర్ సిమి సింగ్ వీడ్కోలు..!

ఐర్లాండ్ ఆల్‌రౌండర్ సిమి సింగ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. భారత్ నుంచి వలస వెళ్లి ఐరిష్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సిమి.. 39 ఏళ్ల వయసులో రిటైర్మెంట్ ప్రకటించాడు. రెండేళ్ల క్రితం తీవ్ర అనారగ్యంతో బాధపడిన అతడు.. ఈమధ్యే పూర్తిగా కోలుకున్నాడు. కానీ, కుర్రాళ్ల నుంచి పోటీ ఎక్కువవ్వడం, వయసు పైబడడంతో పునరాగమనం అసాధ్యమని తెలిసి మంగళవారం హఠాత్తుగా ఆటకు అల్విదా చెప్పేశాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి ఐర్లాండ్ ఆటగాడు సిమి సింగ్ రిటైరయ్యాడు. భారత్ నుంచి 19 ఏళ్ల వయసులో ఆ దేశం వెళ్లిన సిమి.. క్రికెటర్‌గా రాణించాడు. 2017లో అరంగేట్రం చేసిన సిమి.. వీడ్కోలు మ్యాచ్ లేకుండానే తొమ్మిదేళ్ల కెరీర్‌ను ముగించాడు. నాలుగేళ్ల క్రితం టీ20 వరల్డ్‌కప్ ఆడిన ఆ ఆల్‌రౌండర్ 2021లో ఐసీసీ పురుషుల వన్డే జట్టులో చోటు సంపాదించాడు. 29 ఏళ్లకు డెబ్యూ క్యాప్ అందుకొని న్యూజిలాండ్‌పై తొలి మ్యాచ్ ఆడిన సిమి.. ఐర్లాండ్ తరఫున 88 మ్యాచ్(35 వన్డేలు, 53 టీ20లు)లు ఆడాడు. బంతితో రాణించి 83 వికెట్లు తీసిన అతడు 2021లో దక్షిణాఫ్రికా అజేయ శతకం సాధించాడు.





ఆ మ్యాచ్‌లో సఫారీలపై ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన వన్డే సెంచరీ బాదిన తొలి ఆటగాడిగా సిమి చరిత్ర సృష్టించాడు. క్రికెట్ కెరీర్ కొనసాగుతున్న సమయంలోనే సిమి సింగ్ అనారోగ్యానికి గురయ్యాడు. 2024లో అతడు కాలేయ మార్పిడి చేయించుకున్నాడు. ఇటీవలే పూర్తిగా కోలుకున్నాడు. ప్రస్తుతం అతడికి 39 ఏళు .. దాంతో.. ఇక పునరాగమనం కష్టమే అనుకున్న సిమి వీడ్కోలు ప్రకటించాడు. అంతర్జాతీయ క్రికెట్ ఆడాలనే కోరికతో నేను 19 ఏళ్ల పిల్లాడిగా ఐర్లాండ్‌కు వచ్చా. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుటే నా ప్రయాణం ఎంతో గొప్పగా అనిపిస్తోంది. నాకు మద్దతిచ్చినందుకు, నాపై నమ్మకం ఉంచినందుకు ఐర్లాండ్ క్రికెట్‌కు ధన్యవాదాలు. నా కుటుంబం ప్రేమ, మద్దతు లేకపోయి ఉంటే ఇదంతా సాధ్యమయ్యేది కాదు అని సిమి పేర్కొన్నాడు.

# వన్డే క్రికెట్‌లో వెస్టిండీస్ చరిత్ర



వన్డే క్రికెట్‌లో వెస్టిండీస్ చరిత్ర సృష్టించింది. 53 ఏళ్ల తమ వన్డే క్రికెట్ చరిత్రలో తొలిసారి 400ం స్కోర్ చేసింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా గౌహతి వేదికగా బుధవారం జరిగిన రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్ 405/7 స్కోర్ చేయడం ద్వారా ఈ ఫీట్ సాధించింది. వన్డే క్రికెట్ చరిత్రలోనే వెస్టిండీస్‌కు ఇదే అత్యధిక స్కోర్ కావడం గమనార్హం. జాన్ క్యాంబెల్(68 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్స్‌లతో 101), కెప్టెన్ షై హోప్(94 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 104), అమీర్ జంగూ(77 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్స్‌లతో 114) శతకాలతో చెలరేగడంతో విండీస్ ఈ భారీ స్కోర్ నమోదు చేసింది. అంతేకాకుండా వెస్టిండీస్ వన్డే క్రికెట్ చరిత్రలోనే ఒకే ఇన్నింగ్స్‌లో ముగ్గురు బ్యాటర్లు శతకాలు సాధించడం కూడా ఇదే తొలిసారి. 2019లో ఇంగ్లండ్‌పై సెయింట్ జార్జ్ వేదికగా చేసిన 389 పరుగులే వెస్టిండీస్‌కు హయ్యెస్ట్ స్కోర్‌గా ఉండగా.. గౌహతి మ్యాచ్‌లో ఈ రికార్డ్‌ను అధిగమించింది. వెస్టిండీస్ బ్యాటర్ల విధ్వంసంతో భారత బౌలర్లు తేలిపోయారు. అరంగేట్ర పేసర్ అకీబ్ నబీ 8.5 ఓవర్లలో 84 పరుగులిచ్చి ఒక్క వికెట్ తీయలేకపోయాడు. గుర్నూర్ బ్రార్ 10 ఓవర్లలో 2 వికెట్లు తీసినప్పటికీ 96 పరుగులు సమర్పించుకున్నాడు. ప్రసిధ్ కృష్ణ 5 ఓవర్లలోనే 45 పరుగులిచ్చుకోగా.. జడేజా, కుల్దీప్ యాదవ్ పూర్తి కోటా బౌలింగ్ చేసి 75, 65 పరుగులు ఇచ్చుకున్నారు.

# టీమిండియా చీఫ్ సెలెక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓజా?

టీమిండియా మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా భారత క్రికెట్ జట్టు తదుపరి చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. అజిత్ అగార్కర్ ఈ పదవి నుంచి వైదొలగడంతో, ప్రస్తుతం సెలెక్షన్ కమిటీకి తాత్కాలిక హెడ్‌గా ఉన్న 39 ఏళ్ల ఓజానే పూర్తిస్థాయి చీఫ్ సెలెక్టర్‌గా నియమించనున్నట్లు తెలుస్తోంది. మంగళవారం గువాహటిలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో నలుగురు సెలెక్టర్ల కమిటీ సుదీర్ఘంగా సమావేశమైంది. వెస్టిండీస్‌తో రెండో వన్డేకు ఒకరోజు ముందు బర్సపరా స్టేడియంలో ఈ భేటీ జరిగింది. ఈ సమావేశంలో ప్రజ్ఞాన్ ఓజాతో పాటు శివ సుందర్ దాస్, అజయ్ రాత్రా, ఆర్‌పీ సింగ్ పాల్గొన్నారు. అయితే, మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఇందులో పాలుపంచుకోలేదు. సాధారణంగా ఒక ద్వైపాక్షిక సిరీస్ సమయంలో సెలెక్షన్ కమిటీ మొత్తం ఇలా సమావేశం కావడం అరుదు కావడంతో, ఓజా నియామకం దాదాపు ఖరారైనట్లేనని తెలుస్తోంది. త్వరలో ప్రారంభం కానున్న న్యూజిలాండ్ పర్యటనకు



భారత జట్లను ఎంపిక చేసే విషయంపైనే ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. అక్టోబర్ 22 నుంచి నవంబర్ 27 వరకు జరగనున్న ఈ సుదీర్ఘ పర్యటనలో భారత్ ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టులు ఆడనుంది. దీంతో పాటు, అక్టోబర్ 24 నుంచి న్యూజిలాండ్‌లో మూడు టెస్టులు ఆడనున్న భారత్ 'ఎ' జట్టును కూడా ఎంపిక చేయాల్సి ఉంది. భారత జట్టు వరుస సిరీస్‌లతో తీరిక లేకుండా ఉండటంతో ఆటగాళ్ల వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కొత్త సెలెక్షన్ కమిటీకి పెద్ద సవాలుగా మారనుంది. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని జట్టు కూర్పును సిద్ధం చేసేందుకు కూడా ఈ పర్యటన కీలకం కానుంది. సీనియర్ జట్టు అవసరాలతో పాటు, భారత్ 'ఎ' కార్యక్రమాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం ఓజా నేతృత్వంలోని కమిటీ ముందున్న ప్రధాన కర్తవ్యం.

# ఫైనల్లోకి భారత మహిళల హాకీ జట్టు




ఆసియా క్రీడల్లో జయభేరి మోగిస్తున్న భారత మహిళల హాకీ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. లీగ్ దశ నుంచి దుమ్మురేపిన టీమిండియా సెమీఫైనల్లో దక్షిణ కొరియాను చిత్తు చేసి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. తద్వారా 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ పసిడి పోరుకు సిద్ధమైంది భారత్. కీలకమైన ఈ మ్యాచ్‌లో ఇషికా ఔదరీ, కెప్టెన్ సలీమా టెటె చెరో గోల్‌తో రాణించారు. పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత మహిళల హాకీ జట్టు స్వర్ణానికి అడుగు దూరంలో నిలిచింది. తొలి రౌండ్ నుంచి అదరగొట్టిన టీమిండియా బుధవారం సెమీఫైనల్లో దక్షిణా కొరియాను నిలువరించింది. పటిష్టమైన కొరియాపై 2-0తో గెలుపొందిన భారత్.. 44 ఏళ్ల స్వప్నాన్ని సాకారం చేస్తూ ఫైనల్లో అడుగుపెట్టింది. చివరగా 1982లో ఢిల్లీ వేదికగా జరిగిన క్రీడల్లో పసిడి పతకం సాధించింది మహిళల జట్టు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు సలీమా టెటె సారథ్యంలోని భారత బృందం సంచలన ఆటతో ప్రత్యర్థులను మట్టికరిపించింది. బుధవారం దక్షిణ కొరియాపై ఇషికా చౌదరీ 44వ నిమిషంలో.. కెప్టెన్ సలీమ 48వ నిమిషంలో గోల్ చేయగా.. ఉమెన్ ఇన్ సాఫ్రాన్ దర్జాగా ఫైనల్ చేరింది. స్వర్ణం కోసం డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను టీమిండయా ఢీకొట్టనుంది.

# (సంపాదకీయం)

## డ్రాగన్ తో చర్చలు సఫలీకృతం అయ్యేనా!?

భారత్ తో డ్రాగన్ మళ్లీ కలిసేందుకు సిద్ధమైంది. గత విద్వేషాలకు స్వస్తి పలుకుతూ భారత్ తో సుస్థిర బంధం ఏర్పరుచుకోవడానికి చైనా తహతహ లాడుతోంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్, తదనంతర పరిణామాలతో భారత్ విమానయాన సంస్థలకు పాకిస్తాన్ తన గగనతలాన్ని మూసేసింది. దీంతో పాకిస్తాన్ మీదుగా వెళ్లాల్సిన భారత విమానాలు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఐరోపా, ఉత్తర అమెరికా వైపు వెళ్లే విమానాలు ఇతర మార్గాల్లో వెళ్తున్నాయి. దీనివల్ల ప్రయాణ సమయం, నిర్వహణ ఖర్చు పెరగడం వల్ల విమానయాన సంస్థలపై ఆర్థిక భారం పడుతోంది. ఈ నేపథ్యంలో భారత్ గత ఏడాది కాలంగా ప్రత్యామ్నాయ మార్గాల్ని అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా చైనాలోని హోటాన్ మీదుగా విమానాలు నడిపేందుకు అనుమతివ్వాలని డ్రాగన్ ను కోరుతోంది.అయితే ఇన్నాళ్లూ భారత్ చేసిన ఈ ప్రతిపాదనపై చైనా స్పందించడం లేదు. కానీ తాజాగా బ్రిక్స్ సదస్సు సందర్భంగా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ భారత్‌లో పర్యటించినప్పుడు.. ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చైనా అధికారులతో భారత అధికారులు చర్చలు జరుపుతున్నారు. భారత విమానయాన సంస్థలకు ప్రత్యామ్నాయ మార్గంగా జిన్‌జియాంగ్ గగనతలాన్ని ఇచ్చేందుకు భారత్.. చైనాతో చర్చలు జరుపుతోందని అధికారులు తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గాలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ చైనా ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతోందని వారు స్పష్టం చేశారు.జిన్‌పింగ్ ఢిల్లీ పర్యటనకు ముందు, చైనా సదరన్ ఎయిర్‌లైన్స్, ఆరు సంవత్సరాలుగా నిలిపివేసిన మార్గాన్ని పునరుద్ధరిస్తూ.. సెప్టెంబర్ 21 నుండి గ్వాంగ్‌జౌ–న్యూఢిల్లీ మధ్య ప్రత్యక్ష విమాన సర్వీసులను తిరిగి ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. కోవిడ్ మహమ్మారి, భారత్–చైనా సరిహద్దు వెంబడి నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష విమాన సంబంధాలను పునరుద్ధరించే ప్రయత్నంలో ఇదొక భాగం. భారత్–చైనా మధ్య పునఃప్రారంభించిన తొలి భారతీయ విమానయాన సంస్థ ఇండిగో. గత అక్టోబర్‌లో కోల్‌కతా–గ్వాంగ్‌జౌ మధ్య ఇండిగో సర్వీసులను పునఃప్రారంభించింది. నవంబర్‌లో ఢిల్లీ–గ్వాంగ్‌జౌ మధ్య కూడా భారత్–చైనా ప్రత్యక్ష విమాన సర్వీసులను తిరిగి ప్రారంభించింది. ఆ తర్వాత ఎయిర్ ఇండియా ఫిబ్రవరి 1న ఢిల్లీ–షాంఘై సర్వీసులను నడిపింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు చైనా మీదుగా ఇతర దేశాలకు వెళ్లేందుకు భారత్ అనుమతులు కోరుతోంది. మరోవైపు భారత్– చైనా మధ్య సంబంధాలు గతంతో పోలిస్తే నేడు మెరుగ్గా ఉన్నాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అభిప్రాయపడ్డారు. సరిహద్దు సమస్యలు పరిష్కారం కావడంతో ఇరు దేశాల సంబంధాలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని అన్నారు. సోమవారం న్యూయార్క్‌లో 'ఆసియా సొసైటీ'లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న జైశంకర్ ఈ మేరకు స్పందించారు. "గతంతో పోలిస్తే ప్రస్తుతం సంబంధాలు మెరుగ్గా ఉన్నాయా అని నన్ను అడిగితే, 'అవును' అని అంటాను. 2024తో పోలిస్తే అవి మరింత మెరుగ్గా ఉన్నాయి." అన్నారు. 2020లో భారత్– చైనా మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు తలెత్తిన తర్వాత రెండు దేశాల మధ్య సాధారణ సంబంధాలు నిలిచిపోయాయని జైశంకర్ చెప్పారు. వాణిజ్యం కొనసాగినప్పటికీ, అధికారిక రాకపోకలు, వీసా జారీ, విమాన సర్వీసులు మాత్రం ప్రభావితమయ్యాయని వివరించారు. ఈ క్రమంలోనే సరిహద్దు ఉద్రిక్తతలు పరిష్కారం కాగానే, సంబంధాలు మెరుగుపడటం సహజమని అన్నారు. మేము ఒక అత్యంత ప్రాథమిక సూత్రానికి వచ్చాం. సరిహద్దు పరిస్థితే మన సంబంధాల స్థితిని నిర్ణయిస్తుంది. సరిహద్దులో ఉద్రిక్తతలు కొనసాగుతుండగా, సంబంధాలు మాత్రం సాధారణంగా ఉండాలని ఆశించడం సాధ్యం కాదు. సరిహద్దు పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంటున్న కొద్దీ, మన సంబంధాలు కూడా సాధారణ స్థితికి వస్తాయి. సంబంధాలు సాధారణ స్థితికి రావడం వల్ల మన ఇద్దరికీ ప్రయోజనం చేకూరుతుంది. ఒక నిర్దిష్ట సమస్యపై మాత్రమే పూర్తిగా దృష్టి సారించి, తద్వారా నష్టపోయే పరిస్థితిని నేను కోరుకోను. నాకు అనుకూలమైన పరిష్కారం దొరికితే, దానినే ఎంచుకోవడానికి నేను ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. మన మధ్య సంబంధాల్లో ప్రతిష్టంభన లేదా క్షీణత అనేది వాస్తవానికి మనలో ఎవరికీ ప్రయోజనం చేకూర్చదు. పైగా దీనివల్ల మూడో పక్షాలే లాభపడతాయి. ఇదే విషయాన్ని భారత్? చాలా కాలంగా చైనాకు చెబుతోంది. అలాగే, 'ఇతరులకు ప్రయోజనం చేకూర్చే సమస్యలో మనం చిక్కుకుపోకూడదు' అనే అత్యంత ప్రాథమిక దౌత్య సూత్రాన్ని కూడా మేము నిలకడగా పాటించాం. ఏ కారణం చేతనో, చైనా పక్షం దీనిని అంగీకరించడానికి కొంత సమయం పట్టింది. అయితే, ఆ సుదీర్ఘ ప్రతిష్టంభన మన ప్రయోజనాలకు ఏమాత్రం ఉపయోగపడలేదని నా అభిప్రాయం. అది వారికి కూడా ఏ విధంగానూ మేలు చేయలేదు. మన సంబంధాల్లో మెరుగుదల అనేది కేవలం చైనాతోనే కాకుండా, ప్రపంచ దేశాలతో మనకున్న సంబంధాల్లోనూ మన స్థానాన్ని బలోపేతం చేస్తుందని నేను భావిస్తున్నాను." అని జైశంకర్? అన్నారు. ఇటీవల కాలంలో ఇరు దేశాల సంబంధాల్లో సానుకూల మార్పులు కనిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే బ్రిక్స్ ( సదస్సు కోసం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించడం వంటి పరిణామాలు జరిగాయి. మరోవైపు సీమాంతర ఉగ్రవాదమే భారత్‌కు ఉన్న ప్రధాన ఆందోళన అని విదేశాంగమంత్రి ా.జైశంకర్ అన్నారు. దశాబ్దాలుగా పొరుగు దేశం ఉద్దేశపూర్వకంగా ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తోందని పాకిస్థాన్‌ను ఉద్దేశించి తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రపంచంలో మరే దేశం కూడా భారత్‌లా ఉగ్రవాద బాధితురాలిగా లేదన్నారు. కీలకమైన ఈ ఆందోళనలను భాగస్వామ్య దేశాలు అర్థం చేసుకోకపోతే ద్వైపాక్షిక సంబంధాలపై కచ్చితంగా ప్రతికూల ప్రభావం పడుతుందని జైశంకర్ హెచ్చరించారు.

# పోలీసుల దిగ్బంధనంలో రాజన్న సిరిసిల్ల..



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటన నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలీసులు భారీగా మోహరించారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో అర్ధరాత్రి నుంచే ముందస్తు అరెస్టుల పరంపర ప్రారంభమైంది. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, యువజన, విద్యార్థి నేతలు, ఆటోడ్రైవర్ల సంఘాల ప్రతినిధులు, రైతు నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. పలువురిని ఇళ్ల వద్దే అదుపులోకి తీసుకోగా.. మరికొందరిని రాత్రి నుంచే స్టేషన్లకు తీసుకెళ్లారు.సీఎం సభలో ఆరు గ్యారంటీలు, యూత్ డిక్లరేషన్, పెండింగ్ బిల్లులు, యూరియా, విద్యుత్, రైతు సమస్యలు, ఆటోడ్రైవర్ల ఇబ్బందులు, మధ్యమానేరు నిర్వాసితుల సమస్యలపై ప్రశ్నలు తలెత్తకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. సిరిసిల్ల పట్టణంలోని కార్మిక కాలనీలోనూ పోలీసులు భారీగా నిఘా ఏర్పాటు చేశారు. సభకు ప్లకార్డులతో వెళ్లకుండా కార్మిక నాయకులకు హెచ్చరికలు జారీ చేశారు.ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రాష్ట్రస్థాయి నాయకుల కదలికలపైనా పోలీసులు దృష్టి సారించారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్‌ను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలి ంచారు. మధ్యమానేరు నిర్వాసితుల సమస్యలను సీఎంకు వివరించేందుకు ప్రయత్నిస్తున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజు యాదవ్ కూడా పోలీసుల చర్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "సీఎం పర్యటనను అడ్డుకుంటామని ఎక్కడా చెప్పలేదు. అయినా ఉదయం నుంచే అరెస్టులు ఎందుకు చేస్తున్నారు?

మధ్యమానేరు నిర్వాసితుల సమస్యలను సీఎంకు చెప్పాలనుకుం టున్నాం. ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం ప్రజాస్వా మ్యానికి విరుద్ధం" అని నాగరాజు యాదవ్ పేర్కొన్నారు.

# యూపీలో అన్ని దర్యాప్తులు సీబీఐకే అప్పగించాలా?'



ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు దర్యాప్తు నిర్వహించిన తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. పోలీసులు ఇదే పద్ధతిని అనుసరిస్తే.. ఇకపై యూపీలో జరిగే అన్ని దర్యాప్తులను సీబీఐకి అప్పగించడమే మంచిదని జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవాలతో కూడిన ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించింది. 'ప్రతి విషయంలోనూ మీకొక స్వార్థపూరిత ఉద్దేశం ఉంటుంది. మీరు కేసులను ఈ విధంగా ముందుకు తీసుకెళ్తే ప్రజలు మిమ్మల్ని ఎలా నమ్ముతారు? ఇలా ఉంటే.. ఇకపై దర్యాప్తులన్నింటినీ సీబీఐకి అప్పగించాల్సి ఉంటుంది' అని పేర్కొంది.ఫిర్యాదుదారుడు.. నిందితుణ్ని సంఘటనా స్థలంలోనే పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నప్పటికీ.. పోలీసులు మాత్రం అతణ్ని అపరిచిత వ్యక్తిగా ఎఫ్ఐఆర్‌లో చేర్చడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'అతణ్ని స్పాట్‌లోనే పట్టుకున్నప్పుడు గుర్తుతెలియని వ్యక్తిగా ఎందుకు నమోదు చేశారు? సంఘటనా స్థలంలోనే పట్టుబడినా.. తెలియని బైక్ అని ఎఫ్ఐఆర్‌లో రాయడమేంటి?' అని ధర్మాసనం నిలదీసింది. కాగా.. పోలీసులు మొదట్నుంచీ ఈ దర్యాప్తును ఏకపక్షంగా నిర్వహించారని పిటిషనర్ ఆరోపించారు. హైకోర్టు జోక్యంతో పోలీసులు నిందితుడి పేరును ఛార్జిషీట్‌లో చేర్చినప్పటికీ.. ఆ తర్వాత అతనికి క్లీన్ చిట్ ఇచ్చారని వివరించారు. బైక్‌ను స్వాధీనం చేసుకున్నప్పుడు దానికి నంబర్ ప్లేట్ లేదని, అయితే దర్యాప్తు సమయంలో దానికి రిజిస్ట్రేషన్ నంబర్‌ను జోడించారని కూడా పేర్కొన్నారు.దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ.. పోలీసుల పనితీరుపై తీవ్రంగా మండిపడింది. 'నియమాలను పాటించడం ఒక విషయమైతే, అన్ని హద్దులు దాటడం పూర్తిగా వేరే విషయం.. ఆపై కప్పిపుచ్చడం ఇంకో విషయం. దీని గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. స్పాట్‌లోనే పట్టుబడినా.. నిందితుడి పేరును ఎందుకు ఎఫ్ఐఆర్‌లో ఎందుకు చేర్చలేదు? అంటే పరిస్థితులు మీకు అనుకూలంగా ఉంటే పేరు మార్చవచ్చని, లేదంటే ఇంకొకరి పేరును చేర్చేందుకే ఇలా చేశారా? అక్కడ వ్యవహారమంతా ఇలాగే కొనసాగుతోందా?' అని ప్రశ్నించింది. యూపీ పోలీసులు దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ కూడా పూర్తిగా నిరాశపరిచిందని అభివర్ణించింది. తదుపరి విచారణకు సంబంధిత పోలీస్ అధికారి వ్యక్తిగతంగా హాజరు కావాలన్న ధర్మాసనం.. ఈ సారి పూర్తిస్థాయి అఫిడవిట్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించింది. ఈ ఎఫ్ఐఆర్‌పై స్పష్టమైన వివరణ ఇవ్వాలనీ పేర్కొంది.

# ఆధునిక సాంకేతికత వైద్యులను భర్తీ చేస్తుందా..

### నిపుణులు ఏం చెబుతున్నారు..?



వైద్య రంగం కేవలం వ్యాధులను గుర్తించడం, చికిత్స అందించడానికే పరిమితం కాకుండా వేగంగా మారుతోంది. ఆసుపత్రుల్లో అపాయింట్‌మెంట్ బుకింగ్ నుంచి వైద్య రికార్డులను పొందడం, పరీక్షలు చేయించుకోవడం, చికిత్స తీసుకోవడం, డిశ్చార్జ్ తర్వాత వైద్యులతో సంప్రదింపులు కొనసాగించడం వరకు ప్రతి దశలో సాంకేతికత వినియోగం పెరుగుతోంది. ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో పాటు వైద్య సమాచారాన్ని సులభంగా పొందే అవకాశం రావడంతో రోగుల అంచనాలు కూడా మారుతున్నాయి. చికిత్సకు సంబంధించిన స్పష్టమైన సమాచారం, ఖర్చుల్లో పారదర్శకత, ఆసుపత్రిలో సులభమైన అనుభవాన్ని వారు కోరుకుంటున్నారు. ఈ మార్పులకు అనుగుణంగా ఆసుపత్రుల్లో డిజిటల్ సేవలు, అనుసంధానమైన వ్యవస్థలు, అధునాతన వైద్య సాంకేతికతలు అందుబాటులోకి వస్తున్నాయి.
వైద్యులను భర్తీ చేస్తుందా..ఇకపై డిజిటల్ వైద్య సేవల వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది. ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డుల ద్వారా రోగి ఆరోగ్యానికి సంబంధించిన ముఖ్యమైన వివరాలను వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బంది సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీంతో చికిత్సలోని వివిధ దశల్లో ఒకే సమాచారాన్ని పదేపదే సేకరించాల్సిన అవసరం తగ్గుతుంది. ఆసుపత్రి నమోదు, వైద్యుల సంప్రదింపులు, పరీక్షలు, చికిత్స, డిశ్చార్జ్ వంటి ప్రక్రియలను అనుసంధానించే వ్యవస్థలు కూడా పెరుగుతున్నాయి. అపాయింట్‌మెంట్లు బుక్ చేసుకోవడం, పరీక్షల నివేదికలను పొందడం వంటి సేవలను రోగులు డిజిటల్‌గా ఉపయోగించుకునే అవకాశం పెరుగుతోంది. అయితే సాంకేతికత వైద్యులను భర్తీ చేయదని, వైద్యుల నిర్ణయ సామర్థ్యం, మానవీయత, రోగులతో సమర్థవంతమైన సంభాషణకు ఎప్పటికీ ప్రాధాన్యం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

**నూతన సాంకేతికతలు కీలకం..**

వ్యాధుల నిర్ధారణలోనూ కొత్త సాంకేతికతలు కీలకంగా మారుతున్నాయి. అణు స్థాయి పరీక్షలు రోగి ఆరోగ్య పరిస్థితిపై మరింత వివరమైన సమాచారాన్ని అందిస్తాయి. దీంతో వ్యాధిని మరింత కచ్చితంగా అంచనా వేసి, రోగి అవసరాలకు అనుగుణంగా చికిత్సను రూపొందించే అవకాశం ఉంటుంది. మరోవైపు రోబోటిక్ సహాయంతో చేసే శస్త్రచికిత్సలు, తక్కువ కోతలతో నిర్వహించే చికిత్సలు కూడా ఎంపిక చేసిన రోగులకు అందుబాటులోకి వస్తున్నాయి. కొన్ని శస్త్రచికిత్సల్లో చిన్న కోతల కారణంగా శరీరంపై గాయం తక్కువగా ఉండడం, ఆసుపత్రిలో ఉండే సమయం తగ్గడం, త్వరగా కోలుకునే అవకాశం ఉండడం వంటి ప్రయోజనాలు ఉంటున్నాయి. అయితే ఇవి శస్త్రచికిత్స రకం, రోగి ఆరోగ్య పరిస్థితి, వైద్య బృందం నిర్ణయంపై ఆధారపడి ఉంటాయి.

**వేగంగా అందుతున్న వైద్య సేవలు..**

ఆసుపత్రిలోని వివిధ విభాగాల మధ్య మెరుగైన సమన్వయం ఏర్పడితే రోగులు ఎదురుచూసే సమయం కూడా తగ్గే అవకాశం ఉంది. అపాయింట్‌మెంట్లు, పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు ఒకదానితో ఒకటి అనుసంధానమైతే చికిత్స ప్రక్రియ మరింత సులభంగా సాగుతుంది. చికిత్స ఖర్చులు, బిల్లింగ్, బీమాకు సంబంధించిన వివరాల్లో పారదర్శకతకు కూడా భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం లభించనుంది
. ముఖ్యంగా సంక్లిష్టమైన చికిత్సల్లో వైద్యుల ఫీజులు, పరీక్షలు, మందులు, శస్త్రచికిత్స, ఆసుపత్రిలో చేరడం, తదుపరి చికిత్స వంటి ఖర్చులపై స్పష్టమైన సమాచారం రోగులకు ఉపయోగపడుతుంది. అలాగే డిశ్చార్జ్‌తో వైద్య సంరక్షణ ముగిసిపోకుండా, హెల్ప్‌లైన్‌లు, డిజిటల్ సేవలు, వైద్య బృందాలతో నిరంతర సంప్రదింపుల ద్వారా ఫాలోఅప్, కోలుకునే విధానం, తదుపరి సంరక్షణను కొనసాగించే అవకాశం పెరుగుతోంది. సాంకేతికత, వైద్య నైపుణ్యం, అనుసంధానమైన ఆసుపత్రి వ్యవస్థలు కలిసి భవిష్యత్తులో రోగులకు మరింత సమాచారంతో కూడిన, సమన్వయం కలిగిన వైద్య అనుభవాన్ని అందించే దిశగా మార్పులు తీసుకురానున్నాయి.

# దేశంలో పెరుగుతున్న అల్జీమర్స్ వ్యాధి కేసులు..



వయసు పెరుగుతున్న కొద్దీ జ్ఞాపకశక్తి తగ్గడం, విషయాలను గుర్తుంచుకోవడంలో ఇబ్బంది పడడం సహజమేనని భావిస్తూ ఉంటారు. అయితే జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం, రోజువారీ పనులను నిర్వహించే విధానంలో స్పష్టమైన మార్పులు కనిపిస్తే వాటిని వృద్ధాప్యంలో సహజంగా వచ్చే మార్పులుగా నిర్లక్ష్యం చేయకూడదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. దేశంలో వృద్ధుల్లో చిత్తవైకల్యం కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ మార్పులను తొలిదశలోనే గుర్తించి వైద్యుల సలహా తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు చెబుతున్నారు. ప్రస్తుతం భారత్‌లో 60 ఏళ్లు పైబడిన వారిలో సుమారు 88 లక్షల మంది చిత్తవైకల్యంతో జీవిస్తున్నట్లు అంచనా. ఈ సంఖ్య 2036 నాటికి దాదాపు 1.69 కోట్లకు చేరుకునే అవకాశం ఉందని నిపుణులు పేర్కొన్నారు.

### అల్జీమర్స్ కేసులే అధికం..

చిత్తవైకల్యం కేసుల్లో ఎక్కువ భాగం అల్జీమర్స్ వ్యాధికి సంబంధించినవే. ఇది మెదడులోని నాడీకణాలను క్రమంగా దెబ్బతీసే ప్రగతిశీల నాడీ సంబంధిత వ్యాధి. జ్ఞాపకశక్తి తగ్గడం మాత్రమే కాకుండా ఆలోచించడం, మాట్లాడడం, నిర్ణయాలు తీసుకోవడం, స్వతంత్రంగా రోజువారీ పనులు చేసుకోవడం వంటి సామర్థ్యాలపై కూడా దీని ప్రభావం పడుతుంది. అల్జీమర్స్ లక్షణాలు బయటకు కనిపించడానికి చాలా సంవత్సరాల ముందే మెదడులో మార్పులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మెదడులో అమైలాయిడ్ అనే ప్రొటీన్ అసాధారణంగా పేరుకుపోవడం వంటి మార్పులు సాధారణ లక్షణాలు కనిపించడానికి సుమారు 20 ఏళ్ల ముందే ప్రారంభమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

### ముందే గుర్తించాలి..

ప్రారంభ దశలోనే వ్యాధి లక్షణాలను గుర్తించడం ద్వారా బాధితులు, వారి కుటుంబ సభ్యులు పరిస్థితిని మెరుగ్గా అర్థం చేసుకోవడంతోపాటు భవిష్యత్తు సంరక్షణకు అవసరమైన ప్రణాళికలను రూపొందించుకోవచ్చు. చికిత్స, సంరక్షణ, అందుబాటులో ఉన్న సహాయక సేవల గురించి ముందుగానే తెలుసుకోవడం కూడా సాధ్యమవుతుంది. జ్ఞాపకశక్తిలో పదేపదే మార్పులు కనిపించడం, విషయాలను అర్థం చేసుకోవడంలో ఇబ్బంది, నిర్ణయాలు తీసుకోవడంలో సమస్యలు, సంభాషణలో మార్పులు లేదా రోజువారీ పనులను స్వతంత్రంగా చేసుకోవడంలో ఇబ్బంది వంటి మార్పులను గమనిస్తే వైద్యులను సంప్రదించడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఇటువంటి లక్షణాలకు అనేక కారణాలు ఉండే అవకాశం ఉన్నందున వైద్యపరీక్షల ద్వారా అసలు కారణాన్ని గుర్తించడం ముఖ్యమని చెబుతున్నారు.

### కుటుంబం అప్రమత్తత అవసరం..

అల్జీమర్స్ వ్యాధి ఒక్క బాధితుడి జీవితాన్నే కాకుండా మొత్తం కుటుంబంపై ప్రభావం చూపే పరిస్థితి. అందువల్ల జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం, రోజువారీ పనితీరులో వస్తున్న మార్పులపై కుటుంబ సభ్యులు కూడా శ్రద్ధ వహించాలి. వ్యాధి పెరుగుతున్న భారాన్ని ఎదుర్కోవాలంటే ప్రజల్లో అవగాహన పెంచడం, లక్షణాలను తొలిదశలోనే గుర్తించడం, సకాలంలో వైద్య నిపుణులను సంప్రదించడం అవసరమని నిపుణులు చెబుతున్నారు. కుటుంబ సభ్యుల అవసరాలు, అభిప్రాయాలు, భవిష్యత్తు సంరక్షణకు సంబంధించిన అంశాలపై ముందుగానే చర్చించుకోవడం ద్వారా పరిస్థితిని ఎదుర్కోవడానికి మెరుగైన ప్రణాళిక రూపొందించుకోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.



# మున్ముందు ధరలు ఇంకా దిగే అవకాశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: బంగారం ధరలు మరింత తగ్గుతాయా? అంటే అవుననే సమాధానమే మార్కెట్ ఇస్తున్నది. గతకొద్ది రోజులుగా తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్న పుత్తడి విలువను అనేక అంశాలు ప్రభావితం చేస్తున్నాయి. దేశ, విదేశీ మార్కెట్లలో నెలకొన్న ఈ పరిస్థితులనుబట్టి ముమ్మందు పసిడి రేట్లు పడిపోవడమైతే పక్కా అన్న అంచనాలే ఎక్కువగా వినిపిస్తుండటం గమనార్హం.

ఎందుకీ దిద్దుబాటు?

ప్రస్తుతానికైతే కళతప్పిన గోల్డ్ మార్కెట్‌కు ప్రధాన కారణం పశ్చిమాసియా సంక్షోభమే. గత 7 నెలలుగా జరుగుతున్న అమెరికా-ఇరాన్ యుద్ధంతో మిడిల్ ఈస్ట్ అట్టుడికిపోతున్నది. ముఖ్యంగా గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తికి ఈ ఉద్రిక్తకర వాతావరణంతో బ్రేకులుపడ్డాయి. అలాగే క్రూడ్ సహా అంతర్జాతీయ వాణిజ్య రవాణాకు కీలకమైన హార్మూజ్ జలసంధి ఇంచుమించుగా మూసుకుపోయింది. దీంతో గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధర పెరుగడం మొదలైంది. ప్రపంచ పెట్రో ఉత్పత్తుల రవాణాలో 20-25 శాతం హార్మూజ్ మీదుగానే జరుగుతున్నది మరి. ఈ నేపథ్యంలో అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. అవన్నీ బంగారానికి ఉన్న డిమాండ్‌ను తగ్గిస్తూపోతున్నాయి. ధరల్లో కరెక్షన్‌కు దారితీస్తున్నాయి. గల్ఫ్ వార్‌కు ముగింపు కార్డు పడే పరిస్థితైతే కనిపించడం లేదు.

# ఈ మసాలాలను ఎంతో రుచిగా ఇంట్లోనే తయారు చేయవచ్చు..



వంటలకు రుచి, సువాసన తీసుకురావడంలో మసాలాలకు ప్రత్యేకమైన పాత్ర ఉంటుంది. బిర్యానీ, సాంబార్, పప్పు, కూరలు వంటి వంటకాల కోసం చాలామంది మార్కెట్‌లో లభించే ప్యాకెట్ మసాలాలపై ఆధారపడుతుంటారు. అయితే ప్యాకెట్ తెరిచిన తర్వాత గాలి, తేమకు గురికావడం వల్ల వాటి సువాసన, నాణ్యత తగ్గే అవకాశం ఉంటుంది. అందుకే ఇంట్లో అందుబాటులో ఉండే సంపూర్ణ మసాలా దినుసులతో తాజా మసాలాలను తయారు చేసుకోవడం మంచి ప్రత్యామ్నాయం. ఇంట్లో తయారు చేసుకునే మసాలాల్లో ఉపయోగించే పదార్థాల నాణ్యత, తాజాదనాన్ని మనమే నియంత్రించుకోవచ్చు. ముందుగానే తయారు చేసి గాలి చొరబడని డబ్బాల్లో భద్రపరుచుకుంటే అవసరమైనప్పుడు సులభంగా ఉపయోగించుకోవచ్చు. ఇంట్లో సులభంగా చేసుకోదగిన కొన్ని మసాలాల గురించి వంట నిపుణులు వివరిస్తున్నారు.

### గరం మసాలా, చాట్ మసాలా..

గరం మసాలా తయారీకి 2 టేబుల్‌స్పూన్ల ధనియాలు, ఒక టేబుల్‌స్పూన్ జీలకర్ర, ఒక టీ స్పూన్ మిరియాలు, 4-5 పచ్చి యాలకులు, 2 నల్ల యాలకులు, ఒక ఇంచు దాల్చిన చెక్క, 4-5 లవంగాలు, ఒక బిర్యానీ ఆకు తీసుకోవాలి. వీటన్నింటినీ తక్కువ మంటపై 2-3 నిమిషాలు పొడిగా వేయించి సువాసన వచ్చిన తర్వాత పూర్తిగా చల్లార్చాలి. అనంతరం మెత్తగా పొడి చేసి గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవాలి. చాట్ మసాలా కోసం 2 టేబుల్‌స్పూన్ల జీలకర్ర, ఒక టేబుల్‌స్పూన్ ధనియాలు, ఒక టేబుల్‌స్పూన్ నల్ల ఉప్పు, ఒక టీ స్పూన్ సాధారణ ఉప్పు, ఒక టీ స్పూన్ మిరియాలు, ఒక టీ స్పూన్ ఆమ్‌చూర్ పొడి, అర టీ స్పూన్ అల్లం పొడి తీసుకోవాలి. జీలకర్ర, ధనియాలను వేయించి చల్లారిన తర్వాత పొడి చేసి మిగతా పదార్థాలతో కలిపి పొడి డబ్బాలో భద్రపరచాలి.

# అధిక శబ్దాలకు తరచూ గురవుతుంటే శరీరంపై ప్రభావం పడుతుందా..



మన చుట్టూ ఉండే శబ్దాలకు శరీరం క్రమంగా అలవాటు పడుతుంది. ట్రాఫిక్, నిర్మాణ పనులు, పెద్ద శబ్దంతో సంగీతం, రద్దీగా ఉండే ప్రదేశాలు, క్రీడా కార్యక్రమాలు వంటి వాటికి తరచూ గురవుతుంటే కొంతకాలానికి అవి సాధారణంగానే అనిపిస్తాయి. అయితే శబ్దానికి అలవాటు పడడం అంటే అది ఆరోగ్యానికి మేలని అర్థం కాదు. అధిక శబ్దం పర్యావరణ ఆరోగ్యానికి ముప్పుగా మారుతుంది. ముఖ్యంగా ఎక్కువ శబ్దానికి పదేపదే గురికావడం వల్ల వినికిడి సమస్యలతోపాటు గుండె ఆరోగ్యం, రక్తపోటు, నిద్ర వంటి వాటిపైనా ప్రభావం పడే అవకాశం ఉంది.

### చెవులపై అధిక ప్రభావం..

అధిక శబ్దం వల్ల మొదటగా ప్రభావితమయ్యేది చెవులే. పెద్ద శబ్దాలు లోపలి చెవిలోని సున్నితమైన ఇంద్రియ కణాలను దెబ్బతీయడం ద్వారా శాశ్వత వినికిడి లోపానికి దారితీస్తుంది. చెవుల్లో నిరంతరం లేదా తరచూ గంట మోగుతున్నట్లుగా అనిపించడం, అంటే టిన్నిటస్ కూడా శబ్దానికి ఎక్కువగా గురికావడం వల్ల ఏర్పడే సాధారణ సమస్యల్లో ఒకటి. అయితే శబ్ద కాలుష్యం ప్రభావం చెవులకే పరిమితం కాదు. అధిక శబ్దం శరీరంలో ఒత్తిడి ప్రతిస్పందనను పెంచి గుండె వేగం, రక్తపోటు వంటి శారీరక ప్రక్రియలను ప్రభావితం చేస్తాయి. నిద్రకు అంతరాయం కలిగించడం ద్వారా కూడా శరీరంపై ఒత్తిడిని పెంచుతుంది. ఎక్కువ కాలం ట్రాఫిక్ శబ్దానికి గురికావడం అధిక రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు, పక్షవాతం, టైప్-2 మధుమేహం వంటి సమస్యలతో సంబంధం ఉన్నట్లు అధ్యయనాలు సూచించాయి.

### సమయం, తీవ్రతపై ఆధారపడి..

శబ్దం వల్ల కలిగే ప్రమాదం దాని తీవ్రతతోపాటు ఎంతసేపు, ఎంత దగ్గరగా దానికి గురవుతున్నామనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. బాణసంచా లేదా తుపాకీ కాల్పుల వంటి అత్యంత పెద్ద శబ్దాలు చాలా తక్కువ సమయంలోనే వినికిడిని దెబ్బతీస్తాయి.

## జీఎల్‌పీ-1 మందులతో చూపు కోల్పోయామని కంపెనీలపై బాధితుల ఫిర్యాదు.. ఖండించిన సంస్థలు..



మధుమేహం, ఊబకాయం నియంత్రణలో విస్తృతంగా ఉపయోగిస్తున్న జీఎల్‌పీ-1 తరగతి మందులపై అమెరికాలో కొత్త వివాదం మొదలైంది. ఓజెంపిక్, వెగోవీ, జెప్‌బౌండ్ వంటి మందులు వాడిన తర్వాత అకస్మాత్తుగా చూపు కోల్పోయినట్లు పలువురు రోగులు ఆరోపిస్తూ వాటి తయారీ సంస్థలపై కేసులు వేశారు. ఈ కేసుల్లో ప్రధానంగా నాన్‌ఆర్టెరిటిక్ యాంటీరియర్ ఇస్కీమిక్ ఆప్టిక్ న్యూరోపతి (ఎన్‌ఏఐఓఎన్) అనే అరుదైన కంటి సమస్యను ప్రస్తావించారు. ఈ పరిస్థితి సాధారణంగా ఒక కంటిలో అకస్మాత్తుగా చూపు తగ్గడానికి కారణమవుతుంది. అయితే కేసులు దాఖలైనంత మాత్రాన మందుల వల్లే ఈ సమస్య ఏర్పడిందని నిర్ధారణ అయినట్లు కాదు. మందుల తయారీ సంస్థలు కూడా ఈ ఆరోపణలను ఖండించాయి.

### అధ్యయనంలో ఏం తేలింది..

జీఎల్‌పీ-1 మందులు, ముఖ్యంగా సెమాగ్లుటైడ్ విషయంలో చూపు కోల్పోయే ప్రమాదంపై ఆందోళనలు కొన్ని పరిశీలనాత్మక అధ్యయనాల తర్వాత మొదలయ్యాయి. 2024లో దాదాపు 2.97 లక్షల మందిపై నిర్వహించిన అంతర్జాతీయ అధ్యయనంలో సెమాగ్లుటైడ్ వాడకానికి, ఎన్‌ఏఐఓఎన్‌కు మధ్య గణాంకపరంగా గణనీయమైన సంబంధం కనిపించలేదు. అయితే ఇతర పరిశోధనల్లో మాత్రం ఈ రెండింటి మధ్య సాధ్యమైన సంబంధం ఉన్నట్లు సూచనలు రావడంతో మరింత పరిశీలన కొనసాగుతోంది. 2025లో ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఈ అంశంపై వైద్య ఉత్పత్తి హెచ్చరికను జారీ చేసింది. యూరప్, బ్రిటన్ నియంత్రణ సంస్థలు సెమాగ్లుటైడ్ మందులతో ఎన్‌ఏఐఓఎన్ చాలా అరుదుగా సంభవించే దుష్ప్రభావంగా పేర్కొన్నాయి.



# నెయ్యి మన శరీరానికి మేలు చేస్తుంది..

భారతీయ వంటకాలలో నెయ్యికి ప్రత్యేక స్థానం ఉంది. పప్పు, అన్నం, చపాతీలతో పాటు పండుగల సమయంలో తయారుచేసే స్వీట్లలోనూ నెయ్యిని విస్తృతంగా ఉపయోగిస్తారు. ఆయుర్వేదంలోనూ నెయ్యికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అయితే నెయ్యి ఆరోగ్యానికి మేలు చేస్తుందనే నమ్మకంతో పరిమితి లేకుండా తీసుకోవడం మాత్రం సమస్యలకు దారితీస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. నెయ్యిలో కొవ్వు, ముఖ్యంగా సంతృప్త కొవ్వు అధికంగా ఉంటుంది. సుమారు 100 గ్రాముల నెయ్యిలో 883 కిలోకేలరీల శక్తి ఉంటుంది. అందువల్ల నెయ్యి నాణ్యతతోపాటు తీసుకునే పరిమాణంపై కూడా శ్రద్ధ పెట్టడం అవసరం.

### కొవ్వు పేరుకుపోయే అవకాశం..

రోజువారీ ఆహారంలో నెయ్యి పరిమాణం పెరిగితే శరీరంలో సంతృప్త కొవ్వు అధికమవుతుంది. ఇది రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలను ప్రభావితం చేస్తుంది. అధిక కొలెస్ట్రాల్ కాలక్రమేణా రక్తనాళాల గోడలపై పేరుకుపోయి వాటిని ఇరుకుగా మార్చే అవకాశం ఉంటుంది. ఫలితంగా గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ముఖ్యంగా భారతీయుల్లో బయటకు సన్నగా కనిపించినప్పటికీ శరీరంలో కొవ్వు నిల్వలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఈ అంశం మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ఆసియా ప్రజలకు అధిక బరువును అంచనా వేసే బాడీ మాస్ ఇండెక్స్ పరిమితిని 23గా పరిగణిస్తారు.



# ఊర్వశి రౌతేలా వర్సెస్ ఏఐ కంపెనీ..

బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా పేరు ఇప్పుడు సినిమాల కంటే ఓ అంతర్జాతీయ టెక్ వివాదంతో హాట్ టాపిక్‌గా మారింది. లాస్ ఏంజెల్స్‌కు చెందిన ఓ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఊర్వశి బృందం ప్రకటించింది. తన అనుమతి లేకుండా తన పేరు, ఫొటోలు, వీడియోలను వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించారనేది ఆమె బృందం ఆరోపణ. ఈ వ్యవహారంలో నష్టపరిహారంగా సుమారు రూ.7,000 కోట్లు కోరుతున్నట్లు తాజాగా వెల్లడించింది..ఊర్వశి రౌతేలా బృందం సోషల్ మీడియాలో చేసిన ప్రకటనతో ఈ వివాదం వెలుగులోకి వచ్చింది.ఈ సందర్భంగా ఊర్వశి బృందం ఏఐ సంస్థలకు గట్టి హెచ్చరిక చేసింది. ఎవరైనా తమ సొంత ఏఐ సంస్థను ఏర్పాటు చేసుకోవచ్చని, తమ బ్రాండ్‌ను అభివృద్ధి చేసుకోవచ్చని.. అయితే అనుమతి లేకుండా ఊర్వశి రౌతేలా పేరు, గుర్తింపు, చిత్రాలను తమ వ్యాపార ప్రయోజనాల్లో ఉపయోగించకూడదని స్పష్టం చేసింది.ప్రత్యేకంగా సెలబ్రిటీల పేరు, రూపం, వీడియోలు, డిజిటల్ గుర్తింపును ఏఐ ఆధారిత వాణిజ్య కార్యకలాపాల్లో ఉపయోగించే విషయంలో అనుమతి, హక్కులు వంటి అంశాలు ఎంత కీలకమో ఈ వివాదం మరోసారి చర్చకు తెచ్చింది.మరోవైపు ఊర్వశి బృందం చేసిన ఆరోపణలపై సంబంధిత ఏఐ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ షీరాజ్ హసన్ స్పందించారు. రూ.7,000 కోట్ల క్లెయిమ్‌ను ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. ఊర్వశి గతంలో తమ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూను ప్రస్తావిస్తూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బాలీవుడ్ భవిష్యత్తుపై ఆమె చేసిన వ్యాఖ్యలను ఆయన గుర్తుచేశారు.

# రజనీకాంత్ 'ధర్మన్'లో శ్రీలీల..






సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'ధర్మన్' సినిమాకు సంబంధించి రోజుకో ఆసక్తికరమైన విషయం బయటకు వస్తోంది. ఇప్పటికే ఈ సినిమాలో రామ్ పోతినేని నటిస్తున్నారనే విషయం హీరోయిన్ రాశీ ఖన్నా అనుకోకుండా వెల్లడించిన సంగతి తెలిసిందే. తాజాగా మరో కీలక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఈ చిత్రంలో శ్రీలీల కూడా భాగమైనట్లు తాజా వీడియోతో స్పష్టమైంది. 'ధర్మన్' సినిమా షూటింగ్ జరుగుతున్న ప్రాంతం నుంచి తాజాగా ఓ వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. ఇందులో శ్రీలీల సంప్రదాయ దుస్తుల్లో కనిపించారు. దీంతో ఈ సినిమాలో ఆమె నటిస్తున్నారనే విషయం దాదాపు ఖరారైంది. ఇప్పటివరకు చిత్రబృందం శ్రీలీల పాత్రకు సంబంధించి ఎలాంటి అధికారిక వివరాలను వెల్లడించలేదుఆమె సినిమాలో ఎలాంటి పాత్రలో కనిపించనున్నారు? రజనీకాంత్ పాత్రతో ఆమెకు ఎలాంటి సంబంధం ఉంటుంది? కథలో ఆమె పాత్రకు ఎంత ప్రాధాన్యత ఉంటుంది? అనే విషయాలు మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్‌లోనే ఉన్నాయి. శ్రీలీల 'ధర్మన్'లో నటిస్తున్నారనే వార్త బయటకు రావడంతో మరో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ఈ సినిమాలో రామ్ పోతినేని కూడా కీలక పాత్రలో నటిస్తున్న నేపథ్యంలో.. శ్రీలీల ఆయనకు జోడీగా కనిపించబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే రామ్ పోతినేని, శ్రీలీల కలిసి 'స్కంద' సినిమాలో నటించారు. ఆ సినిమాలో వీరిద్దరి కెమిస్ట్రీకి మంచి గుర్తింపు వచ్చింది. దీంతో 'ధర్మన్'లో కూడా వీరిద్దరూ జంటగా కనిపిస్తే మరో సారి అభిమానులకు ఆసక్తికరమైన కాంబినేషన్ అవుతుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది అయితే శ్రీలీల, రామ్ పోతినేని జోడీగా నటిస్తున్నారనే విషయంపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు. కాబట్టి ప్రస్తుతం ఇది కేవలం ప్రచారంలో ఉన్న వార్తగానే చూడాల్సి ఉంటుంది. మరోవైపు 'ధర్మన్' సినిమా నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. తాజాగా చిత్రబృందం మూడో షెడ్యూల్ షూటింగ్‌ను పూర్తి చేసినట్లు ప్రకటించింది. దీంతో సినిమా నిర్మాణంలో మరో కీలక దశ పూర్తయింది. షూటింగ్ దశల వారీగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో త్వరలోనే సినిమా నుంచి మరిన్ని కీలక అప్‌డేట్స్ వచ్చే అవకాశం ఉంది.ముఖ్యంగా రామ్ పోతినేని, శ్రీలీల పాత్రలపై చిత్రబృందం ఎప్పుడు అధికారికంగా స్పందిస్తుం దనేది ఆసక్తిగా మారింది.అశ్వత్ మారిముత్తు రచన, దర్శకత్వంలో 'ధర్మన్' తెరకెక్కుతోంది. కమల్ హాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ సంస్థ.. టర్మరిక్ మీడియాతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

# ముంబై టెరర్ అటాక్స్ నేపథ్యంలో రాజ్ కుమార్ రావు కొత్త సినిమా..

బాలీవుడ్ ప్రముఖ నటుడు రాజ్ కుమార్ రావు ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ప్రహార్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఉజ్వల్ నికమ్' దేశాన్ని షాక్‌కి గురిచేసిన ముంబై ఉగ్రరూప దాడుల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్ తాజాగా విడుదలైంది. దేశం గర్వించదగ్గ ప్రముఖ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ నికమ్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. ముఖ్యంగా 26/11 ముంబై ఉగ్రదాడి సమయంలో అజ్మల్ కసబ్ కేసుకు సంబంధించి ఆయన చేపట్టిన సాహసోపేతమైన వాదనలు, కోర్టు రూమ్ డ్రామా మరియు ఆయన వ్యక్తిగత జీవితంలోని ముఖ్య ఘట్టాలను ఈ చిత్రంలో చూపించనున్నారు.ఈ బయోపిక్‌లో ఉజ్వల్ నికమ్ పాత్రలో టాలెంటెడ్ యాక్టర్ రాజ్ కుమార్ రావు తన నటనతో మెప్పించనున్నారు. ఆయన సరసన వామికా గబ్బి ప్రధాన పాత్రలో నటిస్తుండగా, జైదీప్ అహ్లావత్, సికందర్ ఖేర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అవినాష్ అరుణ్ ధవారే ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. ప్రముఖ నిర్మాణ సంస్థ మ్యాడాక్ ఫిల్మ్స్ పతాకంపై దినేష్ విజన్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 16, 2026 న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.




## ఒకేసారి మూడు ఓటీటీల్లోకి 'అమీర్ లోగ్'.. స్ట్రీమింగ్ ఎక్కడంటే?



టాలీవుడ్‌లో సరికొత్త ప్రయోగాలతో వస్తున్న చిన్న చిత్రాలు ఓటీటీ ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తున్నాయి. పెద్దగా అంచనాలు లేకుండా, పూర్తిగా నూతన నటీనటులతో తెరకెక్కిన విభిన్నమైన కామెడీ డ్రామా సినిమా 'అమీర్ లోగ్'. రమణా రెడ్డి సోమ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం గత నెల 21వ తేదీన థియేటర్లలోకి వచ్చి నిశ్శబ్దంగా ప్రేక్షకులను పలకరించింది. అయితే ఆ సమయంలో సరైన ప్రమోషన్స్ లేకపోవడం, అదే సమయంలో రవితేజ 'ఇరుముడి' సినిమా ప్రభావం గట్టిగా ఉండటంతో ఈ చిత్రం థియేట్రికల్ రన్‌లో పెద్దగా బజ్ సృష్టించలేకపోయింది. చాలామంది ప్రేక్షకులకు ఈ సినిమా థియేటర్లలో రిలీజైన సంగతి కూడా తెలియదు. అయితే, ఈ చిన్న సినిమా ఇప్పుడు ఏకకాలంగా మూడు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లలోకి అడుగుపెట్టి రికార్డు సృష్టించింది. ప్రస్తుతం ఈ చిత్రం 'ఆహా', 'అమెజాన్ ప్రైమ్ వీడియో', 'సన్ నెక్స్ట్' ఓటీటీలలో స్ట్రీమింగ్‌కు అందుబాటులో ఉంది.

## విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న 'ది ప్యారడైజ్' టీమ్





విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారిని టాలీవుడ్ నేచురల్ స్టార్ నానితో పాటు 'ది ప్యారడైజ్' చిత్ర యూనిట్ దర్శించుకున్నారు. సినిమా సక్సెస్ కావడంతో పాటు, ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందనకు కృతజ్ఞతగా టీమ్ అంతా కలిసి విజయవాడకు పయనమయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఈ వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన ఈ యాక్షన్ డ్రామా ఇటీవల భారీ అంచనాల నడుమ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విడుదలైన మొదటి రోజు నుంచి బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా రికార్డు స్థాయి కలెక్షన్లతో దూసుకుపోతోంది. తొలి రోజే రూ.80 కోట్లకు పైగా వసూలు చేసి నాని కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ఓపెనింగ్స్ సాధించిన చిత్రంగా 'ది ప్యారడైజ్' సరికొత్త చరిత్ర సృష్టించింది. ప్రస్తుతం ఈ సినిమా రూ.200 కోట్ల క్లబ్ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది.ఈ నేపథ్యంలో విజయవాడ చేరుకున్న నానికి ఆలయ అధికారులు మరియు వేద పండితులు ఘన స్వాగతం పన్నారు. గర్భాలయంలో అమ్మవారిని దర్శించుకున్న నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మరియు చిత్ర బృందం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం వేద పండితులు నానికి వేదాశీర్వచనం అందించి, అమ్మవారి శేషవస్త్రాలు మరియు తీర్థప్రసాదాలను బహూకరించారు. ఈ చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ కథానాయకిగా నటించగా, మోహన్ బాబు, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు తదితరులు కీలక పాత్రల్లో తమ నటనతో ప్రేక్షకులను అలరించారు



## ఫహాద్ ఫాజిల్ 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' సెన్సార్ పూర్తి.!

మలయాళ వర్సటైల్ నటుడు ఫహాద్ ఫాజిల్ ప్రధాన పాత్రలో, సారా పాలేకర్ కీలక పాత్రలో నటిస్తున్న ఫ్యాంటసీ ఎంటర్‌టైనర్ 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' సినిమా సెన్సార్ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి 'యు/ఎ' సర్టిఫికేట్‌ను జారీ చేసిందిదర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి సమర్పకుడిగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకు శశాంక్ యేలేటి దర్శకత్వం వహించారు. ఆర్కా మీడియా వర్క్స్ మరియు షోవింగ్ బిజినెస్ బ్యానర్లపై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్.ఎస్. కార్తికేయ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. చిన్నపిల్లల నుంచి పెద్దలందరూమలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.